సంపుటి : 9
సంచిక : 302
శనివారం
25 జులై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

# పేదవాడి ప్రాణానికి ధీమేది?

## బడ్జెట్‌లో రూ.300 కోట్లు.. బాధిత కుటుంబాలకు భరోసా ఎప్పుడు?






- 2025–26 సవరించిన అంచనాల్లో చంద్రన్న బీమా వ్యయం 'సున్నా'
- 2026–27లో మళ్లీ రూ.300 కోట్లు కేటాయింపు.. అమలు, క్లెయిమ్‌లపై మాత్రం స్పష్టత కరవు
- 2024లో ఏపీలో 19,557 రోడ్డు ప్రమాదాలు.. 8,346 మంది మృతి
- 26 జిల్లాల్లో మరణాలు, దరఖాస్తులు, చెల్లింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఏ ఘటనైనా సరే – పేద కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### చంద్రన్న బీమా – పేద కుటుంబాల జీవితరేఖ

రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోతే పేద కుటుంబాలు రోడ్లపై పడుతున్నాయి. ఇలాంటి భద్రత కోసం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం ప్రకటించింది. రూ. 300 కోట్లు కేటాయింపు జరిగినా, అమలు, క్లెయిమ్‌ల ఆమోదం, చెల్లింపులపై స్పష్టత లేదు. అధికారిక వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ప్రమాద మరణం లేదా శాశ్వత వైకల్యానికి రూ.5 లక్షల వరకే చెల్లిస్తామని చూపుతోంది. అయితే, ప్రజల్లో విస్తృతంగా చర్చలో ఉన్న రూ.10 లక్షల హామీపై స్పష్టత అవసరం. జిల్లా వారీగా మరణాలు, దరఖాస్తులు, ఆమోదించబడిన క్లెయిమ్‌లు, తిరస్కరించిన క్లెయిమ్‌లు, పెండింగ్ దరఖాస్తులు, ఇప్పటివరకు చెల్లించిన పరిహారం వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

### కేటాయింపు: రూ.300 కోట్లు

| సాధారణ విభాగం | ఎస్సీ అభివృద్ధి కార్యాచరణ | ఎస్టీ అభివృద్ధి కార్యాచరణ |
|---|---|---|
| రూ.180 కోట్లు | రూ.90 కోట్లు | రూ.30 కోట్లు |

### 2024 రోడ్డు ప్రమాదాలు

| | |
|---|---|
| ప్రమాదాలు | 19,557 |
| మరణాలు | 8,346 |
| రోజుకు సగటు మరణాలు | 23 |

**అమరావతి, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోతే.. ఆ భార్యాబిడ్డలను ఆదుకునేది ఎవరు? విద్యుదాఘాతం, అగ్ని ప్రమాదం, పాముకాటు, పిడుగుపాటు, నీటమునక వంటి ఘటనల్లో సంపాదించే వ్యక్తి మంణిస్తే.. ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఏమిటి? రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాల్లో సంపాదించే వ్యక్తే జీవనాధారం. అతడు అకస్మాత్తుగా మరణిస్తే కుటుంబ ఆదాయం ఒక్కసారిగా నిలిచిపోతుంది. అంత్యక్రియల ఖర్చులు, అప్పులు, పిల్లల చదువులు, వైద్య వ్యయాలు, ఇంటి అద్దెల భారంతో బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. అలాంటి కుటుంబాలకు కొండంత అండగా నిలవాల్సిన చంద్రన్న బీమా పథకానికి బడ్జెట్‌లో వందల కోట్ల రూపాయలు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు, నమోదైన క్లెయిమ్‌లు, పరిష్కరించిన దరఖాస్తులు, బాధితులకు చెల్లించిన

మిగతా .. 2లో..

### వైకాపా నేత జోగి రమేష్ కుటుంబసభ్యులపై
## గృహహింస కేసు



విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబసభ్యులపై గృహహింస కేసు నమోదైంది. ఇబ్రహీంపట్నం పీఎస్‌లో జోగి రమేష్ కుమారుడు రాజీవ్ భార్య మేఘన ఫిర్యాదు చేశారు. మోసం, హత్యాయత్నం, గృహహింస, వరకట్న వేధింపులకు పాల్ప డ్డారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జోగి రమేశ్, ఆయన భార్య శకుంతల, రాజీవ్, ప్రియాంక సహా 11 మందిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి


- తల్లిదండ్రులు-టీచర్లు కలిస్తేనే విద్యార్థుల విజయం
- మెగా పీటీఎంతో విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయం
- ప్రభుత్వ బడులపై పెరుగుతున్న నమ్మకం
- సంక్షేమం విషయంలో రాజీ ప్రసక్తే లేదు.
- గిరిజనులకు అండగా ఉంటాం... ఆందోళన వద్దు
- రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు




**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇప్పటికే గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల మార్కులు తగ్గితే అది విద్యాశాఖ పనితీరుపైనే ప్రతిబింబిస్తుందని, అందుకే మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి అని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు రాణించడానికి విద్యే కారణమని

మిగతా .. 2లో..

### ఖతార్‌లో భారత రాయబారిగా
## శ్రీకర్ రెడ్డి నియామకం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఖతార్‌లో భారత రాయబారిగా తెలుగు వ్యక్తి, సీనియర్ దౌత్య వేత్త కె.శ్రీకర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకంపై భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 2001 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీకర్ రెడ్డి.. ప్రస్తుతం శాన్ ఫ్రాన్సిస్కోలో భారత రాయబారిగా

మిగతా .. 2లో..


## వెంకటాయపాలెం కాలువ విషాదం

### మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ పరామర్శ




రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెం కాలువలో ప్రమాదవశాత్తు ముగ్గురు యువ విద్యార్థులు మృతి చెందిన ఘటన పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని పేర్కొన్నారు. ప్రమాదంలో

మిగతా .. 2లో..




### యువత భవిష్యత్తే
## మోదీకి పరమావధి
### పీవీఎన్ మాధవ్



విశ్వం వాయిస్ న్యూస్ : ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పని చేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను

మిగతా .. 2లో..

### ఎన్‌టీఏలో
## భారీ ప్రక్షాళన
### 47మంది అధికారులు తొలగింపు

దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జేఈఈ, నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో భారీ ప్రక్షాళన చేపట్టింది. పరీక్ష పత్రాల లీకేజీతో ఈ ఏజెన్సీ పదే పదే వివాదాల్లోకి రావడంతో అందుకు కారకులుగా గుర్తించిన 47 మంది


మిగతా .. 2లో..

### విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం


### నీట్ మంటలు.. సభ నుంచి వీధి వరకూ సమరం!

# నీట్ సమరం: రచ్చకెక్కిన 'పరీక్ష' రాజకీయం!



ప్రధాని నరేంద్ర మోదీ



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




- 22 లక్షల మంది భవిష్యత్తును కుదిపేసిన ప్రశ్నపత్రం లీకేజీ
- మే 3 పరీక్ష రద్దు.. జూన్ 21న దేశవ్యాప్తంగా పున:పరీక్ష
- సీబీఐ చేతిలో లీకేజీ ముఠా.. ప్రశ్నల మూలం గుర్తించినట్లు అధికారిక ప్రకటన
- వరుసగా ఐదో రోజా పార్లమెంట్‌లో ప్రతిష్టంభన
- మంత్రి రాజీనామా చేయకపోతే చర్చే లేదు: విపక్షం
- నీట్‌పై సంపూర్ణ చర్చకు సిద్ధం: ధర్మేంద్ర ప్రధాన్
- ఛలో సంసద్‌లో ఉద్రిక్తత.. విద్యార్థులపై లాఠీచార్జ్, బాష్పవాయువు
- పోలీసు చర్యలపై జులై 27న సుప్రీంకోర్టు విచారణ
- ప్రశ్నపత్రం లీకేజీ కేసులకు ప్రత్యేక వేగవంత న్యాయస్థానాలు: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ / హైదరాబాద్, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి**

దేశంలో వైద్య విద్య ప్రవేశానికి నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం విద్యార్థుల భవిష్యత్తును కుదిపేయడమే కాకుండా.. పార్లమెంట్‌ను స్తంభింపజేస్తూ, దేశ రాజధాని వీధులను ఆందోళనలతో అట్టుడికిస్తోంది. మే నెలలో పరీక్ష రద్దుతో మొదలైన విద్యార్థుల ఆవేదన.. జూలై నాటికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌గా మారింది. విద్యార్థి సంఘాలు, యువజన ఉద్యమకారులు జంతర్‌మంతర్‌ను ఉద్యమ కేంద్రంగా మార్చగా.. లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత ఎవరిది? జాతీయ పరీక్షల సంస్థలో లోపాలకు జవాబుదారీ ఎవరు? విద్యార్థులపై పోలీసు బలప్రయోగం ఎందుకు చేయాల్సి వచ్చింది? అన్న ప్రశ్నలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది.

**మే 3న పరీక్ష.. 22 లక్షల మందికి షాక్!**

నీట్-యూజీ 2026 పరీక్షను మే 3న దేశవ్యాప్తంగా నిర్వహించారు. 22 లక్షలకుపైగా అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు ముందే కొన్ని ప్రశ్నలు, సమాధానాలు వాట్సాప్ సమూహాలు, కోచింగ్ వర్గాల్లో చక్కర్లు కొట్టినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. రాజస్థాన్‌తోపాటు పలు ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన విచారణలో ప్రశ్నపత్రంతో సరిపోలుతున్న చేతిరాత ప్రశ్నలు, ఎలక్ట్రానిక్ పరికరాలు

మిగతా .. 2లో..

### బాక్స్ ఐటమ్ – 1: నీట్ వివాదం కాలక్రమం

- మే 3: నీట్-యూజీ 2026 పరీక్ష
- మే 12: పరీక్ష రద్దు; సీబీఐ కేసు నమోదు
- మే 15: లీకేజీ మూలంతో సంబంధం ఉన్నవారి అరెస్టులు
- జూన్ 21: దేశవ్యాప్తంగా పున:పరీక్ష
- జులై 16: ఫలితాల విడుదల
- జులై 20: ఛలో సంసద్; లాఠీచార్జ్
- జులై 23: వేగవంత న్యాయస్థానాల ప్రకటన
- జులై 24: పార్లమెంట్ స్తంభన; ప్రభుత్వం-ఉద్యమ నేతల చర్చలు
- జులై 27: సుప్రీంకోర్టు విచారణ

### బాక్స్ ఐటమ్ – 2: ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- లాఠీచార్జ్‌కు బాధ్యులపై చర్యలు
- శాంతియుత నిరసనకారులపై కేసుల ఉపసంహరణ
- బాధిత విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
- జాతీయ పరీక్షల సంస్థలో సమూల సంస్కరణలు
- భవిష్యత్ పరీక్షలకు పటిష్ఠమైన డిజిటల్ భద్రత

# పేదవాడి ప్రాణానికి ధీమేది?

(మొదటిపేజీ తరువాయి)

పరిహారంపై సమగ్ర సమాచారం ప్రజలకు అందుబాటులో లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**కేటాయింపు రూ.300 కోట్లు.. సవరించిన అంచనా సున్నా!**

రాష్ట్ర ప్రభుత్వ 2026-27 బడ్జెట్ పద్దులను పరిశీలిస్తే చంద్రన్న బీమా పథకానికి మొత్తం రూ.300 కోట్లు కేటాయించారు. ఇందులో సాధారణ కార్మిక సంక్షేమ విభాగం కింద రూ.180 కోట్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాచరణ కింద రూ.90 కోట్లు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్యాచరణ కింద రూ.30 కోట్లు చూపించారు. అయితే ఇదే బడ్జెట్ పత్రంలో 2025-26 బడ్జెట్ అంచనాగా రూ.300 కోట్లు చూపించినప్పటికీ, ఆ సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాల్లో చంద్రన్న బీమా వ్యయం సున్నాగా నమోదైంది. 2026-27కు తిరిగి రూ.300 కోట్లు ప్రతిపాదించారు. అంటే నిధుల కేటాయింపు కనిపిస్తున్నా.. గత ఆర్థిక సంవత్సరంలో వాటి వినియోగం ఎందుకు జరగలేదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది.

**రూ.300 కోట్ల లెక్క**

సాధారణ విభాగం - రూ.180 కోట్లు, ఎస్సీ అభివృద్ధి కార్యాచరణ - రూ.90 కోట్లు, ఎస్టీ అభివృద్ధి కార్యాచరణ - రూ.30 కోట్లు, మొత్తం - రూ.300 కోట్లు, 2025-26 బడ్జెట్ అంచనా - రూ.300 కోట్లు, 2025-26 సవరించిన అంచనా - సున్నా, 2026-27 బడ్జెట్ అంచనా - రూ.300 కోట్లు

**2024లో 8,346 మంది రోడ్డు ప్రమాదాలకు బలి**

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 2024 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది మొత్తం 19,557 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో 8,346 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023తో పోలిస్తే ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ, మరణాలు 8,137 నుంచి 8,346కు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర రవాణాశాఖ విడుదల చేసిన 26 జిల్లాల వారీ నివేదికలో 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 15,279 ప్రమాదాలు, 6,796 మరణాలు, 16,707 మంది గాయపడినట్లు నమోదైంది. అక్టోబర్ వరకు జిల్లా వారీ సమాచారం అందుబాటులో ఉన్నప్పటికీ, నవంబర్-డిసెంబర్ కలిపిన పూర్తి జిల్లా వారీ గణాంకాలను ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

**ఒక్క 2024లోనే రోజుకు సగటున 23 మరణాలు!**

ఏడాది మొత్తం నమోదైన 8,346 రోడ్డు ప్రమాద మరణాలను రోజువారీ సగటుగా పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రతిరోజూ దాదాపు 23 మంది రహదారులపై ప్రాణాలు కోల్పోయినట్లవుతుంది. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం ఉంటుంది. మృతుల్లో కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఉంటే ఆ కుటుంబం ఆదాయ వనరును పూర్తిగా కోల్పోతుంది. ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం అందకపోతే బాధిత కుటుంబం అప్పుల ఊబిలోకి దిగజారే ప్రమాదం ఉంటుంది. రోడ్డు ప్రమాదాలతో పాటు అగ్ని ప్రమాదాలు, విద్యుదాఘాతాలు, నీటమునకలు, పిడుగుపాట్లు, పాముకాట్లు, ఇతర ప్రమాద మరణాల గణాంకాలను కూడా ప్రభుత్వం శాఖల వారీగా కాకుండా సమగ్రంగా విడుదల చేయాలి.

**అధికారిక పోర్టల్‌లో రూ.5 లక్షలే!**

చంద్రన్న బీమా అధికారిక అంతర్జాల వేదికలో ప్రస్తుతం 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సున్న కుటుంబ పోషకుడి సహజ మరణానికి రూ.1 లక్ష, 18 నుంచి 70 సంవత్సరాల మధ్య ప్రమాద మరణం లేదా శాశ్వత దివ్యాంగత్వానికి రూ.5 లక్షలు, పాక్షిక దివ్యాంగత్వానికి రూ.2.50 లక్షల వరకు ప్రయోజనం ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారిక వివరాల ప్రకారం కార్మికశాఖ నోడల్ సంస్థగా, గ్రామ-వార్డు సచివాలయాల శాఖ అమలు సంస్థగా వ్యవహరించాలి. గ్రామ, వార్డు సచివాలయాలను లబ్ధిదారుల నమోదు, క్లెయిమ్‌ల పరిశీలన, సేవల పంపిణీకి సహాయ కేంద్రాలుగా గుర్తించినట్లు పోర్టల్ పేర్కొంటోంది. అయితే పథకం కింద ప్రస్తుతం ఎంతమంది కొత్తగా నమోదు అయ్యారు? 2024 జూన్ తర్వాత ఎంతమంది ప్రమాదాల్లో మరణించారు? వారిలో ఎంతమంది కుటుంబాలు బీమా పరిహారం కోసం దరఖాస్తు చేశాయి? ఎంతమందికి నిధులు అందాయి? అనే వివరాలు 26 జిల్లాల వారీగా బహిరంగంగా కనిపించడం లేదు.

**రూ.10 లక్షల మాటేమైంది?**

ప్రమాద మరణానికి రూ.10 లక్షల వరకు భరోసా కల్పిస్తారన్న ప్రచారం నేపథ్యంలో అధికారిక ఉత్తర్వులు, అమలు తేదీ, అర్హత నిబంధనలు, బీమా సంస్థ వివరాలు, పరిహారం మొత్తం గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ప్రస్తుతం అధికారిక పోర్టల్‌లో ప్రమాద మరణానికి రూ.5 లక్షల ప్రయోజనమే చూపుతోంది. కొత్త విధానంలో పరిహారాన్ని పెంచే ప్రతిపాదన ఉంటే దానికి సంబంధించిన జీవో, బీమా ఒప్పందం, అమలు మార్గదర్శకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

**పాత వైఎస్సార్ బీమా క్లెయిమ్‌ల పరిస్థితి ఏమిటి?**

వైఎస్సార్ బీమా అధికారిక పేజీలో 18 నుంచి 50 సంవత్సరాల వారికి ప్రమాద మరణం లేదా పూర్తి దివ్యాంగత్వానికి రూ.5 లక్షలు, 51 నుంచి 70 సంవత్సరాల వారికి రూ.3 లక్షలు, 18 నుంచి 50 సంవత్సరాల మధ్య సహజ మరణానికి రూ.2 లక్షల ప్రయోజనం ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే అధికారిక క్లెయిమ్ స్థితి వ్యవస్థలో కనిపిస్తున్న అనేక నివేదికలు 2021-22 కాలానికి సంబంధించినవిగానే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాల నిర్మాణం ప్రకారం 2024, 2025, 2026 సంవత్సరాల క్లెయిమ్‌ల సమగ్ర నివేదిక బహిరంగంగా అందుబాటులో కనిపించడం లేదు. పాత వైఎస్సార్ బీమా కింద నమోదైన క్లెయిమ్‌లు ఎన్ని? వాటిలో పరిష్కరించినవి, తిరస్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? ప్రభుత్వ మార్పుతో దరఖాస్తులు నిలిచిపోయాయా? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి.

**26 జిల్లాల లెక్కలు బయటపెట్టాలి**

ప్రభుత్వం 2024 జనవరి నుంచి 2026 జూలై వరకు ప్రతి జిల్లాకు సంబంధించిన కింది వివరాలను వెల్లడించాలి:

రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారు, అగ్ని ప్రమాదాల్లో మరణించినవారు, విద్యుదాఘాత మరణాలు, నీటమునక మరణాలు, పిడుగుపాటు, పాముకాటు మరణాలు, బీమా పరిధిలో నమోదైన సహజ మరణాలు, చంద్రన్న-వైఎస్సార్ బీమా క్లెయిమ్‌లు, పరిష్కరించిన దరఖాస్తులు, తిరస్కరించిన క్లెయిమ్‌లు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, బాధిత కుటుంబాలకు చెల్లించిన పరిహారం.

జిల్లాల వారీగా గణాంకాలు వెల్లడించకుండా కేవలం రాష్ట్రస్థాయి కేటాయింపులు ప్రకటించడం వల్ల పథకం వాస్తవంగా ఎంతమందికి చేరిందో నిర్ధారించడం సాధ్యం కాదు.

**ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు**

2025-26లో రూ.300 కోట్లు కేటాయించి సవరించిన అంచనాల్లో సున్నాగా ఎందుకు చూపించారు?
2026-27కు కేటాయించిన రూ.300 కోట్లు ఎప్పటి నుంచి ఖర్చు చేస్తారు?
చంద్రన్న బీమా కింద కొత్త లబ్ధిదారుల నమోదు ప్రారంభమైందా?
బీమా సంస్థతో ఒప్పందం జరిగిందా?.. జరిగితే ఏ తేదీ నుంచి వర్తిస్తుంది?
2024 నుంచి ఇప్పటివరకు నమోదైన క్లెయిమ్‌లు ఎన్ని?
పరిష్కరించినవి, తిరస్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని?
రూ.10 లక్షల ప్రమాద బీమాపై అధికారిక ఉత్తర్వులు ఎప్పుడు విడుదల చేస్తారు?
26 జిల్లాల వారీ శ్వేతపత్రం విడుదల చేయడానికి అభ్యంతరం ఏమిటి?

**ప్రభుత్వం తక్షణమే చేయాల్సినవి**

**1. అమలుపై అధికారిక ఉత్తర్వులు**

పథకం పరిధి, అర్హత, వయోపరిమితి, పరిహారం మొత్తం, అమలు తేదీ, అవసరమైన ధ్రువపత్రాలపై స్పష్టమైన జీవో విడుదల చేయాలి.

**2. పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం**

పాత చంద్రన్న బీమా, వైఎస్సార్ బీమా పథకాల కింద పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను ప్రత్యేక కార్యక్రమం ద్వారా పరిష్కరించాలి.

**3. సచివాలయాల్లో ప్రత్యేక బీమా కేంద్రాలు**

ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో బీమా నమోదు, క్లెయిమ్ స్వీకరణ, దరఖాస్తు స్థితి పరిశీలనకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

**4. తక్షణ మధ్యంతర సాయం**

ప్రమాదంలో కుటుంబ పోషకుడు మరణించిన వెంటనే అంత్యక్రియలు, అత్యవసర కుటుంబ అవసరాల కోసం మధ్యంతర ఆర్థిక సహాయం అందించాలి.

**5. క్లెయిమ్ పరిష్కారానికి గడువు**

పూర్తిస్థాయి పత్రాలు అందిన తర్వాత నిర్ణీత రోజులలో క్లెయిమ్ పరిష్కరించేలా సేవా హామీ విధానాన్ని అమలు చేయాలి.

**6. నెలవారీ బహిరంగ నివేదిక**

ప్రతి నెల జిల్లా వారీగా నమోదైన మరణాలు, క్లెయిమ్‌లు, చెల్లింపులు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలి.

**కేటాయింపులు కాదు..**
**కుటుంబానికి చేరినప్పుడే భరోసా!**

బడ్జెట్ పుస్తకంలో రూ.300 కోట్లు చూపించడం మాత్రమే పేద కుటుంబానికి ధీమా కాదు. ఆపదలో కుటుంబ పోషకుడిని కోల్పోయిన భార్యాబిడ్డల ఖాతాలో సకాలంలో పరిహారం జమ అయినప్పుడే పథకానికి సార్థకత ఉంటుంది. కేటాయించిన నిధులు ఎక్కడున్నాయి? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఎంతమంది కుటుంబాలకు సహాయం అందింది? అన్న వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలి. పేదవాడి ప్రాణానికి విలువ ఉందని మాటల్లో చెప్పడం కాదు.. ఆపదలో అతడి కుటుంబాన్ని ఆదుకోవడం ద్వారా నిరూపించాలి!

# నీట్ సమరం: రచ్చకెక్కిన 'పరీక్ష' రాజకీయం!

(మొదటిపేజీ తరువాయి)

లభించడంతో వివాదం తీవ్రమైంది. కేంద్ర సంస్థలు, దర్యాప్తు విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా మే 12న పరీక్షను రద్దు చేస్తున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ ప్రకటించింది. నీట్ ప్రారంభమైన తర్వాత దేశవ్యాప్తంగా మొత్తం పరీక్షను రద్దుచేయడం ఇదే తొలిసారి.

**సీబీఐ రంగప్రవేశం.. 'మూలం' గుర్తింపు**

కేంద్ర ఉన్నత విద్యాశాఖ ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ ప్రత్యేక కేసు నమోదు చేసింది. నేరపూరిత కుట్ర, మోసం, నమ్మకద్రోహం, ప్రశ్నపత్రం చోరీ, ఆధారాల ధ్వంసం, అవినీతి నిరోధక చట్టం, ప్రభుత్వ పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా నీట్ పరీక్ష ప్రక్రియలో పనిచేసిన రసాయనశాస్త్ర అధ్యాపకుడు పి.వి. కులకర్ణికి ప్రశ్నపత్రాలపై ముందస్తు ప్రవేశం లభించినట్లు సీబీఐ ప్రకటించింది. ఆయన పుణెలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, ప్రశ్నలు--ఎంపికలు--సరైన సమాధానాలను విద్యార్థులకు రాయించినట్లు ఆరోపించింది. ఆ విద్యార్థుల నోటుపుస్తకాల్లోని ప్రశ్నలు అసలు నీట్ ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు పేర్కొంది. విద్యార్థులను సమీకరించిన మధ్యవర్తులు లక్షల రూపాయలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీబీఐ తెలిపింది. మే 15 నాటికి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహిల్యానగర్ ప్రాంతాలకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు అధికారిక ప్రకటన వెలువడింది.

**జూన్ 21న పునఃపరీక్ష**

రద్దయిన పరీక్షను జూన్ 21న దేశవ్యాప్తంగా తిరిగి నిర్వహించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి అదనపు రుసుము వసూలు చేయకుండా పునఃపరీక్షకు అనుమతించారు. జూలై 16న ఫలితాలు ప్రకటించగా 11.21 లక్షల మందికిపైగా అర్హత సాధించారు. పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హరియాణాకు చెందిన పాన్సుల్ బన్సల్ 720 మార్కులకు 715 మార్కులు సాధించారు. పరీక్ష పూర్తయి ఫలితాలు వెల్లడైనప్పటికీ, తొలి పరీక్ష లీకేజీకి బాధ్యులైన వారందరినీ గుర్తించారా? జాతీయ పరీక్షల సంస్థలోని అధికారుల పాత్ర ఏమిటి? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి సంస్కరణలు తీసుకొస్తారు? అన్న ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు కావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

**'కాక్రోచ్ జనతా పార్టీ' అంటే ఏమిటి?**

నీట్ లీకేజీ వివాదం అనంతరం మే నెలలో అభిజీత్ దీప్కే ఆధ్వర్యంలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో వ్యంగ్య ఆన్‌లైన్ యువజన ఉద్యమం ప్రారంభమైంది. ఇది సంప్రదాయ రాజకీయ పార్టీగా కాకుండా విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను ప్రస్తావించే ఉద్యమ వేదికగా వెలుగులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో మొదలైన ఈ ఉద్యమానికి కొద్ది రోజుల్లోనే భారీ స్పందన వచ్చింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో లోపాలు, నిరుద్యోగం, విద్యావ్యవస్థలో జవాబుదారీతనం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. జూన్ మధ్యకాలం నుంచి జంతర్‌మంతర్ వద్ద దీక్షలు ప్రారంభించగా, జూన్ 28న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షలో చేరారు. కాక్రోచ్ జనతా పార్టీ ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, శాంతియుత ఆందోళనకారులపై నమోదైన కేసుల ఉపసంహరణ, బాధిత విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, జాతీయ పరీక్షల సంస్థలో సమూల సంస్కరణలు కోరుతోంది.

**'ఛలో సంసద్'.. రణరంగమైన ఢిల్లీ**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజైన జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ 'ఛలో సంసద్'కు పిలుపునిచ్చింది. పోలీసుల అనుమతి లేనప్పటికీ వేలాది మంది యువత జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని పార్లమెంట్ వైపు కదిలేందుకు ప్రయత్నించారు. భద్రతా బలగాలు బహుళ అంచెల బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రదర్శనకారులను అడ్డుకున్నాయి. కొందరు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. పలువురు విద్యార్థులు, యువకులు గాయపడగా పోలీసు సిబ్బందికీ గాయాలయ్యాయి. గాయపడినవారి సంఖ్యపై పోలీసులు, ఆసుపత్రి వర్గాలు, ఉద్యమకారులు వేర్వేరు వివరాలు వెల్లడించారు. ప్రదర్శనకారులు రాళ్లు రువ్వడంతోనే పరిమిత బలాన్ని ఉపయోగించాల్సి వచ్చిందని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. శాంతియుతంగా ముందుకు వెళ్తున్న యువతను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని ఉద్యమ నాయకులు, విపక్షాలు ఆరోపించాయి. బలప్రయోగంలో పెలెట్ గన్స్ ఉపయోగించారనే ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ప్రస్తావించినప్పటికీ, వాటిపై స్వతంత్ర అధికారిక నిర్ధారణ ఇంకా స్పష్టంగా వెలువడలేదు.

**సుప్రీంకోర్టులో జూలై 27న విచారణ**

విద్యార్థులపై పోలీసు చర్యలకు సంబంధించి తొలుత న్యాయవాది నుంచి ఒక లేఖ మాత్రమే అందిందని, సరైన పిటిషన్ దాఖలు కాకుండానే సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించిందంటూ వార్తలు ప్రచురించడం తప్పని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జూలై 24 ఉదయం స్పష్టం చేశారు. అనంతరం పోలీసు బలప్రయోగాన్ని సవాలు చేస్తూ రెండు అధికారిక పిటిషన్లు దాఖలై, వాటికి దినచర్య సంఖ్యలు కేటాయించినట్లు సీనియర్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆ పిటిషన్లను జూలై 27న విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది.

**లోక్‌సభలో 'ఇస్తీఫా దో' నినాదాలు**

నీట్ వివాదం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వరుసగా ఐదు రోజులపాటు స్తంభింపజేసింది. లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్‌తోపాటు ఇండియా కూటమి సభ్యులు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. సభాపతి ఓం బిర్లా నీట్, ప్రశ్నపత్రాల లీకేజీలపై నిబంధనల ప్రకారం చర్చకు అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినా విపక్ష సభ్యులు ఆందోళన విరమించలేదు. తొలి ఐదు రోజుల్లో ఒక్కరోజు కూడా ప్రశ్నోత్తరాల సమయం పూర్తిగా జరగలేదు. జూలై 24న లోక్‌సభను జూలై 27 వరకు వాయిదా వేశారు. పార్లమెంట్ ఆవరణలో అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఇరువర్గాలు ఎదురెదురుగా నిలిచి నినాదాలు చేయడంతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది మానవహారంగా ఏర్పడి వారిని వేరుచేయాల్సి వచ్చింది.

**'రాజీనామా తర్వాతే చర్చ' - రాహుల్ గాంధీ**

లోక్‌సభలో నీట్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని దేశానికి హామీ ఇచ్చారని, విద్యార్థుల సమస్యపై చర్చ జరగకపోతే ప్రజలకు తప్పుడు సంకేతం వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే వరకు ప్రభుత్వంతో ఎలాంటి చర్చ జరగదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సభలో రిజిజు తన పేరును ప్రస్తావించినప్పుడు సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించినా మైక్ నిలిపివేశారని రాహుల్ ఆరోపించారు. ప్రధానమంత్రి నివాసం సమీపంలోనూ కాంగ్రెస్ నేతలు ధర్నా నిర్వహించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతోపాటు పలువురు విపక్ష నేతలు విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ నిరసన తెలిపారు.

**'విద్యార్థులకు సమాధానం చెప్పాలి' - ధర్మేంద్ర ప్రధాన్**

నీట్ వ్యవహారంపై పార్లమెంట్‌లో సంపూర్ణ చర్చకు ప్రభుత్వం నూటికి నూరు శాతం సిద్ధంగా ఉందని ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. విద్యార్థులను రాజకీయ ప్రచారంలో పావులుగా ఉపయోగించకూడదని, వారికి గందరగోళం కాకుండా స్పష్టత, నినాదాలు కాకుండా పరిష్కారాలు అవసరమని పేర్కొన్నారు. "విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ విద్యార్థులను రాజకీయ సాధనాలుగా ఉపయోగిస్తూ పార్లమెంట్‌ను అడ్డుకుంటోందని ఆయన ఎదురుదాడి చేశారు. ప్రశ్నపత్రం లీకేజీ జరిగినందుకు తాను రాజీనామా చేసి బాధ్యత నుంచి పారిపోనని మంత్రి పేర్కొన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, మంత్రి రాజీనామా చేయకుండానే చర్చకు రావాలని ప్రభుత్వం కోరడం బాధ్యత నుంచి తప్పించుకోవడమేనని విపక్షం వాదిస్తోంది.

**వేగవంత న్యాయస్థానాలు: ప్రధాని మోదీ**

ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో నిందితులకు త్వరగా, కఠినంగా శిక్షలు పడేలా ప్రత్యేక వేగవంత న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 23న ప్రకటించారు. యువత భవిష్యత్తుతో ఆటలాడే వారిని వదిలిపెట్టబోమని, అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశించినట్లు తెలిపారు. కేంద్రం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేసి, నరేశ్‌పాల్ గంగ్వార్‌కు ఉన్నత విద్యాశాఖ బాధ్యతలు అప్పగించింది.

**ప్రభుత్వం-కాక్రోచ్ ఉద్యమ నేతల చర్చలు**

జూలై 24న కేంద్ర మంత్రులు జె.పి.నడ్డా, జితేంద్రసింగ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా చర్చలు జరిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తమ ప్రధాన డిమాండ్ అని ఉద్యమ నాయకులు స్పష్టం చేశారు. ఈ అంశంపై స్పందించేందుకు జూలై 25 మధ్యాహ్నం వరకు సమయం కావాలని ప్రభుత్వం కోరినట్లు ఉద్యమ ప్రతినిధులు వెల్లడించారు. మంత్రి రాజీనామా, నిరసనకారులపై కేసుల ఉపసంహరణ, బాధిత కుటుంబాలకు పరిహారం అనే మూడు ప్రధాన డిమాండ్లపై తదుపరి చర్చ కొనసాగనుంది. సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షను ముగించినప్పటికీ, తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

**పరీక్ష పూర్తయింది.. విద్యార్థుల ప్రశ్నలు మిగిలాయి!**

నీట్ పునఃపరీక్ష పూర్తయింది. ఫలితాలు కూడా విడుదలయ్యాయి. కానీ తొలి పరీక్ష కోసం నెలల తరబడి కష్టపడిన విద్యార్థులు మళ్లీ చదవాల్సి రావడం, పరీక్ష కేంద్రాలకు రెండోసారి ప్రయాణించాల్సి రావడం, కౌన్సెలింగ్ ఆలస్యం కావడం వల్ల ఎదురైన మానసిక, ఆర్థిక నష్టాలకు బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం రాలేదు. లక్షల రూపాయలు వెచ్చించి శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశ్నపత్రం ముందే కొనుగోలు చేసినవారితో పోటీ పడాల్సిన పరిస్థితి వస్తే.. ప్రతిభకు విలువ ఎక్కడ? పరీక్షలపై నమ్మకం ఎలా నిలుస్తుంది? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నిందితులను అరెస్టు చేయడంతో మాత్రమే సమస్య ముగియదని, ప్రశ్నపత్రాల తయారీ నుంచి ముద్రణ, రవాణా, పరీక్ష కేంద్రాల పంపిణీ వరకు ప్రతి దశలో సాంకేతిక భద్రత, స్వతంత్ర తనిఖీలు, అధికారుల జవాబుదారీతనం ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. నీట్ రగడ ఇప్పుడు ఒక పరీక్షకే పరిమితమైన సమస్య కాదు. దేశంలోని ప్రభుత్వ పరీక్షల విశ్వసనీయతకు, యువతలో వ్యవస్థపై ఉన్న నమ్మకానికి ఎదురైన అతిపెద్ద పరీక్షగా మారింది. ప్రభుత్వం, విపక్షాలు రాజకీయ ఆధిపత్య పోరాటాన్ని పక్కనపెట్టి విద్యార్థుల భవిష్యత్తు కేంద్రంగా శాశ్వత పరిష్కారం చూపాల్సిన సమయం ఆసన్నమైంది.

(మొదటిపేజీ తరువాయి)

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి

నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సవాల్ విసిరారు. విశాఖ సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో 13 వేల మంది కళాకారులతో కూడిన సంప్రదాయ థింసా నృత్యం, బొబ్బిలి వీణా నాదంతో ఆయనకు అద్భుత స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఏకంగా 3 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతమంటూ ఏదీ ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని, ఆ ప్రాంత సమగ్ర ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చిరస్థాయిగా నిలిపేందుకే ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారని మాధవ్ వివరించారు.

## వెంకటాయపాలెం కాలువ విషాదం

మృతి చెందిన కనికెళ్ల రంజిత్ (15), పసలపూడి గ్రామానికి చెందిన బొక్కా వీరేంద్ర (19), పదమర కంద్రిగకు చెందిన వసుధ పావని (14) కుటుంబాలను మంత్రి సుభాష్ స్వయంగా పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యుల దుఃఖాన్ని పంచుకుంటూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ఘటనతో మూడు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొందని, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్టకాలంలో ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాల విషయంలో ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొని మృతులకు నివాళులర్పించారు. మంత్రి సుభాష్ వెంట ఆర్డీవో సరళావతి, ఇతర అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులున్నారు.

## ఎన్‌టీఏలో భారీ ప్రక్షాళన

అధికారులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురిపై లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఈ చర్యను ఎన్‌టీఏ ప్రక్షాళనలో తొలి అడుగుగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. లీకులకు అస్కారం లేకుండా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

## ఖతార్‌లో భారత రాయబారిగా శ్రీకర్ రెడ్డి నియామకం

సేవలందిస్తున్నారు. త్వరలోనే నూతన రాయబారిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఖతార్‌లో భారత రాయబారి విపుల్ స్థానంలో శ్రీకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణకు చెందిన శ్రీకర్ రెడ్డి వరంగల్‌లోని కాకతీయ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గతంలో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిగానూ సేవలందించారు.

## చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధి బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ సమానంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులేనని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పీటీఎంలను నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా బోధనా విధానాలను మార్చుకోవాలని, కొత్త పద్ధతులను అవలంభించాలని సూచించారు. టీచర్లకు ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తోందని, బదిలీలను పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**విద్యతో పాటు ఆరోగ్యం, ఉపాధిపైనా ప్రత్యేక దృష్టి**

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. తల్లికి వందనం పథకం నిధులు ఇప్పటికే తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయని చెబుతూ జమ అయ్యాయా లేదా అంటూ సభలోనే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రజారోగ్యంపై దృష్టి సారించామని... ఆగస్టు నుంచి సంజీవని హెల్త్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని తెలిపారు. పైగా 14 శాతం మేర వడ్డీలకు కొన్ని అప్పులను తెచ్చిందని ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ఆ అప్పులను నెమ్మదిగా తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని.. అలాగే వడ్డీలు తగ్గించేలా కసరత్తు చేస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను విస్తరిస్తామని వెల్లడించారు. హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని గుర్తుచేశారు. తన పాలనలో 16 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించానన్నారు. ఈ ఏజెన్సీ ఏరియాలో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో రిక్రూటైన ఉపాధ్యాయులే ఉన్నారని దానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ, తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చప్పామిని.. దానికి అనుగుణంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాము కూటమిగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని... మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు రిక్రూట్ చేస్తే... దానిపై బురద జల్లుతున్నారని సీఎం విమర్శించారు. రిక్రూటైన టీచర్ల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇలాంటి వారిని కట్టడి చేయాలని సూచించారు. రాజకీయ నేతలు, అధికారులు తేడాగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో గతంలో కొందరు దుర్మార్గాలు చేశారని... దళిత డ్రైవరును చంపి డోర్ డెలివరి చేసిన నేతలు ఇక్కడ రాజకీయం చేశారని గుర్తు చేశారు. తల్లిని, చెల్లిని గౌరవించని వాళ్లు సమాజానికి ఏం చెబుతారు..? ఏం మేలు చేస్తారని.. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదని సీఎం అన్నారు. మంచిని ప్రోత్సహించాలి... చెడును తప్పు పట్టాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు.

**డ్రగ్స్‌కు చెక్... గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం**

గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించామని గుర్తు చేశారు. పిల్లలకు చక్కటి విద్యను అందిస్తామని... ఉద్యోగాలకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా పెద్దపెద్ద పరిశ్రమలను తెస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖకు గూగుల్ సంస్థ వచ్చిందని... భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు కష్టపడకుండా.. ఇష్టపడి చదవాలని... ఐదేళ్లు కష్టపడి చదివితే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పోలవరాన్ని నెంబర్-1 జిల్లాగా తయారు చేస్తామని... 2000లో జీవో నెంబర్-3 తెచ్చి.. స్థానిక గిరిజనులకే ఉద్యోగాలిచ్చేలా అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. కానీ 2020లో సుప్రీం కోర్టు ఆ జీవోను రద్దు చేసిందని... దీనిపై ఇప్పుడు చర్చిస్తున్నామని గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

**పేరెంట్స్, టీచర్లతో ముఖాముఖి**

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందర్భంగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, మార్కులు, హాజరు, ఆరోగ్య వివరాలను స్వయంగా పరిశీలించి తల్లిదండ్రులకు వివరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రిపోర్టు కార్డులను వారి ఇళ్లకే పంపేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మరో తరగతి గదిలో స్మార్ట్ బోర్డు ద్వారా బోధనా విధానాన్ని పరిశీలించిన సీఎం.. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ఉత్సాహపరిచారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించిన సీఎం.. గ్రీన్ పాస్‌పోర్టు, క్యూఆర్ కోడ్ ఆధారంగా మొక్కల వివరాలు తెలుసుకునే విధానాన్ని అభినందిస్తూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మెగా పీటీఎం ఫొటోఫ్రేమ్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫొటో దిగారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం**

మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి ఎలా ఉందని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం మరింత మెరుగ్గా అందించాలని సీఎం సూచించారు. విటమిన్ లోపాలు రాకుండా పోషకాహారం అందిస్తున్నామని, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంతో పాటు చిక్కి, ఉదయం రాగిమాల్ట్ అందిస్తున్నామని చెప్పగా, ఇంటికి వెళ్లే ముందు కూడా చిక్కిలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు వారితో కలిసి ప్రత్యేకంగా ఫొటోలు దిగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## లోకల్ ఎలక్షన్..
## కూటమి కన్నా ముందుగా జగన్ ప్లాన్!

ఏపీలో స్థానిక ఎన్నికలకు అన్నిపార్టీలు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబరులో మున్సిపాలిటీలు, ఆ తర్వాత జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలతోపాటు పంచాయతీ పోరు ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో గడువు ముంచుకొస్తుండటంతో అధికార కూటమితోపాటు విపక్షం వైసీపీ కూడా వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా గత సార్వత్రిక ఎన్నికలలో ఓటమితో డీలా పడిన వైసీపీ స్థానిక ఎన్నికలతో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. అధినేత జగన్ పర్యటనలకు జనం భారీగా వస్తుండటంతో పార్టీపై సానుకూలత పెరిగిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. మాజీ సీఎం జగన్ సైతం పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికలకు సంసిద్ధం చేసే ప్రణాళిక సిద్ధం చేశారని అంటున్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని, ఏకగ్రీవం అయ్యే పరిస్థితి తలెత్తకూడదని జగన్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల నేతలతో మాజీ సీఎం జగన్ తాజాగా సమావేశమయ్యారు. వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖ నేతలతో స్థానిక ఎన్నికల్లో వైసీపీ కార్యాచరణపై చర్చించారు. ఎన్నికలు ఎప్పుడైనా సరే ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సర్వసన్నద్ధంగా ఉండాలని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను సాధారణంగా తీసుకునే ధోరణి వీడాలని జగన్ పార్టీ నేతలకు హితవు పలికారు.

స్థానిక ఎన్నికలు సార్వత్రిక ఎన్నికల స్థాయిలోనే అత్యంత ప్రాధాన్యమైనవిగా భావించాలని, విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో శ్రమించాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయిలో పార్టీ పట్టును నిలబెట్టుకోవడానికి ప్రతి గ్రామంలో నియోజకవర్గ సమన్వయకర్తల నేతృత్వంలో విస్తృత సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయాల్సిన బాధ్యత పూర్తిగా నాయకులదేనని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు జగన్ ముందస్తు వ్యూహం సిద్ధం చేశారు. ఏ ఒక్క స్థానంలోనూ పార్టీ అభ్యర్థి లేరనే మాట వినిపించకూడదని, అన్ని స్థానాల్లోనూ సత్తా చాటే అభ్యర్థులను బరిలోకి దింపాల్సిందేనని తేల్చిచెప్పారు. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

### కమిటీలకు గుర్తింపు కార్డులు

పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే నెల నుంచి వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీలకు అధికారికంగా గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు జగన్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఉత్సాహంగా పనిచేస్తూ పార్టీకి అంకితమైన వారిని గుర్తించి వారికి మరింత కీలక బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే, రాబోయే స్థానిక పోరులో అధికార కూటమికి దీటైన పోటీనిచ్చేందుకు వైసీపీ అధినేత ఇప్పటి నుంచే పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

### కోనసీమ జిల్లాలో విషాదం..
## పంటకాల్వలో మునిగి ముగ్గురి మృతి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. రామచంద్రపురం మండలం వెంకటయ్య పాలెంలో పంట కాల్వలో మునిగి ముగ్గురు మృతిచెందారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తొలుత పావని (14) నీటిలో దిగి గల్లంతవగా.. ఆమెను కాపాడేందుకు రంజిత్ (15), వీరేంద్ర (19) కూడా కాల్వలోకి దిగారు. ఈ క్రమంలో వారు కూడా గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మృతులు పసలపూడి, పడమర కండ్రిగ గ్రామాలకు చెందినవారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పగలంతా ఇళ్లను గుర్తిస్తారు.. రాత్రిళ్లు దోచేస్తారు

**శ్రీకాకుళం నుంచి తడ వరకు వరుస చోరీలు – విశాఖకు చెందిన దంపతులు, మరో యువకుడి అరెస్టు**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా తడ వరకు దాదాపు 100 చోరీలు చేసిన కిలాడీ దంపతులను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నున్న పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ గుణ్ణం రామకృష్ణ ఈ వివరాలు వెల్లడించారు. నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు భారీ చోరీలు, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం జరిగింది. నున్న పరిధిలో జరిగిన నేరాలపై కేసు నమోదు చేసిన సీఐ అహ్మద్ అలీ.. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన తోట శివకుమార్(36) ఈ నేరాలు చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. శివకుమార్ ఓ చోరీ కేసులో జైలుకు వెళ్లినప్పుడు విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన తుమ్మల మనోజ్‌కుమార్, మరో యువకుడు పరిచయమయ్యారు. వారిద్దరికీ నేరాలు చేయడంలో ఇతడు శిక్షణ ఇచ్చాడు. ఇటీవల శివకుమార్ భార్యతో కలిసి విజయవాడలోని మనోజ్‌కుమార్ ఇంట్లో దిగాడు. అక్కడి నుంచి రోజూ రెక్కీ చేసి మూడు నేరాలు చేసి పరారయ్యాడు. పోలీసులకు ఘటనాస్థలంలో వేలిముద్రలు లభ్యమయ్యాయి. వాటిని పాత రికార్డులతో పోలిస్తే.. తోట శివకుమార్ వివరాలు వచ్చాయి. సెల్‌టవర్ లొకేషన్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి విజయవాడలో దంపతులిద్దరినీ అరెస్టు చేశారు. వారిని విచారిస్తే.. మనోజ్‌కుమార్‌తో పాటు మరొకరి వివరాలు తెలిశాయి. రూ.15 లక్షల విలువైన 54 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.8 కిలోల వెండి సామగ్రిని స్వాధీనం చేసుకుని, మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో యువకుడి కోసం గాలిస్తున్నారు. శివకుమార్ నేర చరిత్రను పరిశీలించిన పోలీసులు ఆశ్చర్యపోయారు. అతడిపై ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 100 కేసులు నమోదైనట్లు తెలిసింది. ముందుగా ఇతడు ఒక ఊరును ఎంపిక చేసుకుంటాడు. భార్యతో కలిసి అక్కడ అద్దెకు దిగుతాడు. ఆ ప్రాంతంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రిళ్లు దోచుకుని పరారైపోతాడు. ఇలా ఇప్పటివరకు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి తదితర ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు తేలింది.

## రైలుకింద పడి తహసీల్దార్ ఆత్మహత్య

**అభియోగాలపై ఉన్నతాధికారుల విచారణ**



**రాయచోటి, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ విభాగంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు గురువారం చిత్తూరు నగర సమీపంలోని సిద్ధంపల్లె వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో తమిళనాడులోని కాట్పాడి నుంచి చిత్తూరు వస్తున్న మెము ఎక్స్‌ప్రెస్ రైలు సిద్ధంపల్లె వద్దకు చేరుకుంటున్న సమయంలో పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. ఆయన 2024 ఎన్నికల సమయంలో రామాపురం తహసీల్దారుగా పనిచేసి ఎన్నికల తర్వాత లక్కిరెడ్డిపల్లెకు బదిలీ అయ్యారు. ఆ సమయంలో పీజీఆర్ఎస్ అర్జీపై వచ్చిన అభియోగాల కారణంగా ఉన్నతాధికారులు విచారించి ఆ మండలంలోని వీఆర్వో వెంకటరమణను సస్పెండ్ చేయగా శ్రీనివాసులును కలెక్టరేట్‌లోని కేఆర్ఆర్‌సీ (కోనేరు రంగారావు రిఫామ్స్ కమిటీ) విభాగానికి బదిలీ చేశారు. జిల్లా కేంద్రం మదనపల్లెకు మారాక పీజీఆర్ఎస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై వచ్చిన అభియోగాల మీద ఇటీవల ఉన్నతాధికారులు విచారణ చేసి, తప్పులు దొర్లాయనే విషయాన్ని సీసీఎల్ఏకు నివేదించినట్లు తెలిసింది. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా సెలవు పెట్టి చికిత్స పొందుతున్నారు. శ్రీనివాసులు భార్య ఇదే జిల్లా సదుం ఎంపీడీవోగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నట్లు తెలిసింది. ఆయన కుమార్తె ఉన్నతవిద్య కోసం అమెరికా వెళ్లారు. పదో తరగతి చదివే కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీఎస్ పోలీసులు తెలిపారు.

## 4,427 క్వింటాళ్ల సన్నబియ్యం గల్లంతు

**మిల్లు యజమానిపై కేసు**

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని రైస్‌మిల్లులో అక్రమాలు బయటపడ్డాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జరిపిన తనిఖీల్లో రూ.1.23 కోట్ల విలువైన 4,427 క్వింటాళ్ల (442 టన్నులు) సన్నబియ్యం నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం వానాకాలంలో సేకరించిన వడ్లను సీఎంఆర్ కోసం అరుణాచల శివ రైస్‌మిల్లుకు కేటాయించగా.. నిర్దేశిత నిల్వలు కనిపించలేదు. నిల్వల తేడాల కారణంగా 4,427 క్వింటాళ్ల సన్నబియ్యం మాయమైనట్లు గుర్తించిన అధికారులు.. పంచనామా చేసి ఆ రైస్ మిల్లు యజమాని కిరణ్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌ఛార్జి అధికారి మల్లికార్జున్ తెలిపారు. మిల్లు యజమానికి ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

కాకినాడ జిల్లా | తూర్పు గోదావరి జిల్లా | డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా









సత్యం • సమగ్రం • సమాజ బద్ధత

www.viswamvoice.com


# డ్వాక్రా రుణం చెల్లింపుపై వివాదం..

**• యానిమేటర్‌పై వేధింపుల ఆరోపణలు**

• మృతి చెందిన సభ్యురాలి రుణ బాధ్యతపై కుటుంబం మాట తప్పిందని గ్రూప్ సభ్యుల ఆరోపణ..

• బ్యాంకు ఖాతాలు హోల్డ్ కావడంతో ఉద్రిక్తత.. • మీడియాను ఆశ్రయించిన యానిమేటర్ వెంకటలక్ష్మి





**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన శ్రీ విజయదుర్గ మహిళా శక్తి సంఘం డ్వాక్రా గ్రూపులో తీసుకున్న రుణం చెల్లింపుల విషయంలో వివాదం నెలకొంది. గ్రూపులోని సభ్యురాలు సూరిశెట్టి సుబ్బలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె పేరుపై ఉన్న రుణాన్ని ఆమె ముగ్గురు కోడళ్లు విడతల వారీగా చెల్లిస్తామని గ్రూప్ సభ్యుల సమక్షంలో హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. అయితే, ఇచ్చిన హామీ మేరకు రుణం చెల్లించకపోవడంతో గ్రూప్ సభ్యులు సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను కలిసి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు బ్యాంకు మేనేజర్ ఒక నెల గడువు ఇచ్చినప్పటికీ ఆ గడువులో కూడా రుణం చెల్లించలేదని పేర్కొన్నారు. దీంతో బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యుల బ్యాంకు ఖాతాలను హోల్డ్‌లో ఉంచినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో డ్వాక్రా గ్రూపు యానిమేటర్ చదరం వెంకటలక్ష్మిపై కొందరు సభ్యులు, వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా తనను మానసికంగా వేధిస్తున్నారని, పలువురు పదేపదే ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెంకటలక్ష్మి ఆరోపించారు. మృతి చెందిన సభ్యురాలి కుటుంబానికి చెందిన ముగ్గురు కోడళ్లు స్వయంగా సంతకాలు చేసి రుణం తీరుస్తామని అంగీకరించారని, ఇప్పుడు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రావడంతో తమ సంతకాలు ఫోర్జరీ అయ్యాయని చెబుతూ మాట మార్చుతున్నారని ఆమె తెలిపారు. ఈ విషయమై బ్యాంకు అధికారులు గుమ్మళ్లదొడ్డి గ్రామానికి వచ్చి గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సంబంధిత కుటుంబ సభ్యులను కూడా సమావేశానికి రావాలని కోరినా, వారు అధికారుల పిలుపును పట్టించుకోకుండా హాజరుకాలేదని గ్రూప్ సభ్యులు పేర్కొన్నారు. ఈ వివాదంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా గ్రూపు సభ్యులు అధికారులను కోరుతున్నారు.

**అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు**

## ప్రతి శుక్రవారం అన్నప్రసాదం

**డాక్టర్ మిద్దె బాల కోటేశ్వరరావు సేవలకు భక్తుల ప్రశంసలు**




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గ్రామదేవత మాతృశ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న సుదతీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ మిద్దె బాల కోటేశ్వరరావు ప్రతి శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. గత రెండు నెలలుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడు అమ్మవారి ప్రసాదంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మిద్దె బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ, "అమ్మ గుబ్బాలమ్మ ఆశీస్సులు ఉంటే జీవితంలో అన్నీ ఉన్నట్టే. అమ్మవారి కృపతో ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించాం. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రతి శుక్రవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ ముఖ్య సలహాదారు ఏళ్ల శేషు, ఆలయ చైర్మన్ ఆచంట రాజు, వైస్ చైర్మన్ గండ్రెడి సన్యాసిరావు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొని డాక్టర్ బాల కోటేశ్వరరావు చేపట్టిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

**సమస్యలు ఉంటే**

## నా దృష్టికి తీసుకురండి

**ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు**



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ.పోలవరం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బాలికలకు ఉచిత సంక్షేమ సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థినులతో ఆత్మీయంగా ముఖాముఖి మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం, ఆరోగ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్య క్రమంలో ఆర్డీవో సరళావతి, సీఐ మోహన్ కుమార్, ఎస్సై రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరం డ్రైవర్స్ కాలనీలో ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రైవర్స్ కాలనీలోని పాఠశాలలో స్కూల్ చైర్మన్ నక్క రామరాజు ఆధ్వర్యంలో పేరెంట్స్ డే కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కలిసి తమ పిల్లల చదువు, ప్రవర్తన, విద్యా పురోగతి, బోధనా విధానాల గురించి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. పాఠశాల ఆవరణలో తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా అందమైన రంగవల్లులు (ముగ్గులు) వేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించబడింది. కార్యక్రమం అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు పిల్లల భవిష్యత్తు, క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, నైతిక విలువల ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వివేకానంద హాల్లో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా అధికారులు, తదితరులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన వేడుకల వేదిక, జాతీయ పతాక ఆవిష్కరణ, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖలు అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ అధికారులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పరేడ్‌లో పాల్గొనే పోలీసు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యాసంస్థల బృందాలు ముందస్తు సాధన నిర్వహించాలని సూచించారు. దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధి ప్రదర్శనలు, సంక్షేమ పథకాల స్టాల్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే విశిష్ట సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనేదే ప్రభుత్వ లక్ష్యం : బత్తుల

**అత్యధిక మార్కులు సాధించిన 5మందికి స్కూటీలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి 83వేల రూపాయలు ఖర్చు చేస్తుందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం గాడాల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ (4.0) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి,విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలలో వసతులు, ఉచిత విద్య కిట్లు, పౌష్టిక ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ ప్రతి విద్యార్థికి ఏడాదికి 83 వేల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు తాను వ్యక్తిగతంగా స్కూటీలు కొని అందజేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, ఎంఈఓ కుశలోవ దొర, ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, యర్రంశెట్టి పోలారావు, అడపా సుధీర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**కాటవరం గ్రామంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో**

## రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం కాటవరం గ్రామంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంట సాగు యాజమాన్యం మరియు పంటలు భీమ అంశాలపై రైతులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ఆర్‌డీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావాన్ని బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగును ఎంపిక చేసుకోవడం ద్వారా దిగుబడులను కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం, సకాలంలో విత్తడం, పంటల సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు ఎల్-నినో పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, సీడ్ యాజమాన్యం, పంటల బీమా నమోదు విధానం మరియు రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలపై వివరించారు. రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీతానగరం, మండల వ్యవసాయాధికారి, వి.ఎఎలు రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సత్కారం : పెనకటి

**ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సత్కరిస్తూ నగదు పురస్కారాన్ని అందజేసినట్లు కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరంగపట్నం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులను ప్రతి ఏడాది స్వర్గీయ పెనకటి సన్యాసిరావు బాపయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పెనకటి గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరిస్తూ, ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు, ఒక్కొక్కరికి ఆరువేల రూపాయల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు తనకాల నాగేశ్వరరావు వెంకటరమణమ్మ, మాజీ సర్పంచ్ మద్దాల పెద్దమ్మాజీ రమణ,పెనకటి శివాజీ, తనకాల నాయుడు, స్వర్ణ కుమారి నానాజీ, సుందర్ సింగ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.




బడి, ఇల్లు ఏకమైన వేళ...

# అక్షర ప్రాంగణంలో ఆత్మీయ పండుగ!


**కే.గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైభవంగా 'మెగా పి. టీ. ఎం 4.0' - ఉత్సాహంగా సాగిన తల్లిదండ్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ**
**ప్రధానోపాధ్యాయులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అపూర్వ సమ్మేళనం**
**ఆటపాటలు, ముద్దులొలికే చిన్నారుల స్పీచ్‌లు, సహపంక్తి భోజనాలతో ఆకట్టుకున్న విద్యా పండుగ**



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బడి అంటే కేవలం నాలుగు గోడల మధ్య జరిగే పాఠాల బోధన కాదు... అదొక భవిష్యత్తును తీర్చిదిద్దే కర్మాగారం! ఆ కర్మాగారంలో తయారయ్యే విద్యార్థి అనే శిల్పం అద్భుతంగా రూపుదిద్దుకోవాలంటే ఉపాధ్యాయుడి ఉలి దెబ్బలతో పాటు, తల్లిదండ్రుల ఆప్యాయత అనే స్పర్శ కూడా ఎంతో అవసరం. ఇదే సందేశాన్ని సమాజానికి చాటిచెబుతూ, కే.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన 'మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ (పిటీఎం) 4.0' ఒక అక్షర వేడుకను తలపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం కేవలం ఒక మీటింగ్‌లా కాకుండా, ఆత్మీయ బంధాన్ని పెనవేసే గొప్ప ఉత్సవంగా తీర్చిదిద్దారు.

### ఉత్సాహంగా సాగిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ఉదయం పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందం ఘనస్వాగతం పలికింది. ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో విద్యార్థుల తల్లిదండ్రుల 'రిజిస్ట్రేషన్' ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టారు. ప్రతి విద్యార్థి తల్లి లేదా తండ్రి వివరాలను రికార్డుల్లో నమోదు చేసుకుని, వారి సంతకాలను సేకరించారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు, ఇతర వివరాలను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్ యాప్ ద్వారా వారి హాజరును నమోదు చేశారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంతా ఎంతో క్రమశిక్షణతో, పండగ



వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

### రేపటి పౌరులకు దిశానిర్దేశం... హెచ్‌ఎం ప్రసంగం

రిజిస్ట్రేషన్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సభాముఖంగా హెచ్‌ఎం జీవీఎస్ సుబ్రహ్మణ్యం చేసిన ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. "విద్యార్థి దశలో ఉపాధ్యాయులు బడిలో ఎంత శ్రద్ధ తీసుకుంటారో, ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు కూడా అంతే శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుత స్మార్ట్‌ఫోన్ యుగంలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యవసరం. మనమంతా కలిసికట్టుగా శ్రమిస్తేనే, వీరు రేపటి అత్యుత్తమ పౌరులుగా ఎదుగుతారు" అంటూ ఆయన ఇచ్చిన సందేశం తల్లిదండ్రుల్లో కొత్త బాధ్యతను రగిలించింది. ప్రభుత్వం కల్పిస్తున్న డిజిటల్ వసతులు, మధ్యాహ్న భోజనం తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### అబ్బురపరిచిన చిన్నారుల ఆత్మవిశ్వాసం!

ఈ వేడుకలో అందరి దృష్టినీ ఆకర్షించింది ముగ్గురు చిన్నారి విద్యార్థుల ప్రసంగం. వేదికెక్కి చేతిలో మైక్ పట్టుకుని ఏమాత్రం బెదురు లేకుండా ఆ చిన్నారులు తమ పాఠశాల గురించి, తమ లక్ష్యాల గురించి మాట్లాడుతుంటే ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది. "మా టీచర్లు మాకు పాఠాలే కాదు, క్రమశిక్షణ కూడా నేర్పుతున్నారు" అంటూ వారు అనర్గళంగా ఇస్తున్న స్పీచ్ చూసి అక్కడున్న తల్లిదండ్రుల కళ్లు ఆనందంతో మెరిశాయి. పిల్లల్లో దాగిన ఈ అద్భుతమైన ప్రతిభను వెలికితీసిన ఉపాధ్యాయులకు వారు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఆటలు... ఆత్మీయ భోజనాలు

సమావేశం అంటే కేవలం ప్రసంగాలు, ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ మాత్రమే అని కాకుండా, ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా ప్లాన్ చేశారు. తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా పలు గేమ్స్ (ఆటల పోటీలు) నిర్వహించారు. నిత్యం పనుల ఒత్తిడిలో ఉండే తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఉత్సాహంగా ఆటలు ఆడారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ ఒకేచోట కూర్చుని సహపంక్తి భోజనాలు చేశారు. అందరూ ఒకే పంక్తిలో కూర్చుని ఆత్మీయంగా ముచ్చటించుకుంటూ భోజనం చేస్తున్న దృశ్యం పాఠశాల సమైక్యతకు నిదర్శనంగా నిలిచింది. ప్రధానోపాధ్యాయులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం దార్శనికత, ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషి, ఎస్ఎంసీ ఎస్.ఎం.సి కమిటీ సభ్యుల ప్రోత్సాహం, మరియు తల్లిదండ్రుల విశేష భాగస్వామ్యంతో జరిగిన ఈ 'మెగా పి.టీ.ఎం 4.0' రాష్ట్రంలోని ఇతర పాఠశాలలకు ఒక ఆదర్శంగా నిలిచిందని పలువురు కొనియాడారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం - ఎన్‌టిఏ వెంటనే రద్దు చేయాలి**
**నీట్ పరీక్ష లీకేజీ తట్టుకోలేక మరణించిన విద్యార్థులకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలి**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని విద్యా వ్యవస్థలోని వైఫల్యాలను పరిష్కరించాలని ఢిల్లీలో విద్యార్థి యువత పై జరిగిన లాఠీచార్జికి నిరసనగా విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో శుక్రవారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విజయవంతంగా జరిగింది. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఒకరోజు ముందుగానే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థి సంఘాల అభ్యర్థన మేరకు ముందుగానే బంద్ ప్రకటించాయి. అయితే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెగా పేరెంట్స్ డే ఉన్నప్పటికీ పేరెంట్స్ మీటింగ్ అనంతరం విద్యార్థులు తరగతులు బహిష్కరించి బంద్ లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రం అమలాపురంలో డాక్టర్‌అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అయిన సందర్భంగా ఎంతో మంది విద్యార్థులు నష్టపోయారని మనోవేదనతో 22 మంది విద్యార్థులు మరణించారని దీనికి బాధ్యతగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సామాజిక పర్యావరణ వేత్త సోనం వాంగ్చుక్ క్రాక్రోచ్ జనతా పార్టీ గత రెండు నెలలుగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న కానీ మోడీ ప్రభుత్వం నెమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అలాగే విద్యార్థులు యువకులు పట్ల నిరంకుశ వైఖరి అవలంబిస్తుందని ఢిల్లీలో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు యువకులపై అత్యంత



వాసవికంగా లాఠీచార్జీ చేసి చూద్దాం బస్వాయువు ప్రయోగించి అనేకమంది విద్యార్థులను తీవ్రంగా గాయపరిచి ఒక విద్యార్థిని మరణానికి కారణమైందని ఆరోపించారు. మనదేశంలో జరుగుతున్న విద్యార్థులు యువకుల చేస్తున్న పోరాటానికి ప్రపంచంలో అనేక దేశాలు మద్దతుగా నిలిచినప్పటికీ మన దేశ ప్రభుత్వం మాత్రం స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. బ్రిటిష్ వాళ్ళ కంటే అత్యంత దారుణంగా ఈ దేశ భావి భారత పౌరులపై ప్రభుత్వాలు వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కే శంకర్ సిపిఎం జిల్లా కార్యదర్శి కారం వెంకటేశ్వరరావు, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, వెండి డేవిడ్ అంబేద్కర్, సాపే రమేష్, పాలమూరి సందీప్, మెండు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాలు చేయొద్దని హితవు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీకి చెందిన రాష్ట్రస్థాయి కాపు నాయకుల తీరుపై అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ తీవ్ర విమర్శలు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల అంశంపై స్పందించని నాయకులు, టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాత్రమే రిజర్వేషన్ల పేరుతో ఉద్యమాలు చేపట్టడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. గణేష్ మాట్లాడుతూ, వైసీపీలోని కొందరు కాపు నాయకులు ముందుగా తమ బంధువులను జనసేన పార్టీలో చేర్పించి, అనంతరం తాము కూడా చేరేందుకు సిద్ధమవుతున్నారని, మరికొందరు కూటమి ప్రభుత్వంలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో కాపు రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం సరికాదని పేర్కొన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అంతకుముందు వైఎస్సార్ పాలనలో ఉన్నప్పుడు కాపు రిజర్వేషన్ల కోసం ఎందుకు పోరాడలేదు.? ఇప్పుడు మాత్రమే రిజర్వేషన్లు గుర్తుకు రావడానికి కారణమేంటి.?" అని ఆయన ప్రశ్నించారు.ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కొందరు నాయకులు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిన గణేష్, ఎమ్మెల్యే సీట్లు లేదా రాజకీయ పదవుల కోసం ప్రజల ఆకాంక్షలను పక్కనబెడుతున్నారా అని విమర్శించారు. కాపు సమాజం కోసం నిజాయితీగా పనిచేయాలనుకునే నాయకులు అధికారంలో ఎవరు ఉన్నారనే విషయాన్ని పక్కనబెట్టి, అన్ని ప్రభుత్వాలపై ఒకే విధమైన వైఖరితో రిజర్వేషన్ల సాధన కోసం పోరాడాలని సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ఉద్యమాలకు బదులుగా కాపు వర్గ హక్కుల కోసం చిత్తశుద్ధితో ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆయన, శవ రాజకీయాలు, కుల రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా ప్రయోజనాల కోసం నాయకులు పనిచేయాలని హితవు పలికారు. చివరగా, "కాపు నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు కూడా ఈ అంశంపై నిజానిజాలను విశ్లేషించే సమయం వచ్చింది" అని మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ పేర్కొన్నారు.

# ఆస్తులున్నవారి కన్నా చదువున్న వారే గొప్పవారు

**ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి**
**మెగా పేరెంట్ మీట్ 4.0లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లలకు ఆస్తులు కాదు చక్కని చదువులు ఇవ్వాలని తల్లిదండ్రులు ఆలోచించాలని, ఆ విధంగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు లేవు అనే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు ముందడుగు వేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.కొత్తపేట జూనియర్ కళాశాల, వానపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ మీట్ 4.0 లో ఆయన కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు పాఠశాల చైర్మన్ లతో పాల్గొన్నారు. తల్లిదండ్రులతో జరిగిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించి అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పేరెంట్ మీట్ అనేది ఒక అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. చదువులో అమ్మాయిలతో పాటు అబ్బాయిలు కూడా పోటీ పడాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లు, తల్లికి వందనం, క్రీడా కిట్లు ఇవన్నీ అందిస్తుందని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కొందరు దుర్మార్గులు డబ్బు కోసం మత్తు పదార్థాలు మొదలైన దందాలతో వ్యవస్థలను కలుషితం చేస్తున్నారని, వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థుల ముందు డ్రగ్స్ గురించి మాట్లాడటం బాధాకరంగా ఉన్నా మత్తు పదార్థాల వినియోగం అరికట్టడానికి తల్లిదండ్రులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల తల్లిదండ్రులు సైతం ప్రతీ అంశాన్ని ఒక కంట కనిపెట్టి ఉండాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలో ఏసీ రూముల్లో కూర్చుంటే చదువులు వస్తాయని అనుకుంటే పొరపాటని చదువనేది మంచి తర్ఫీదు నిచ్చే ప్రతిభ ఉన్న ఉపాధ్యాయుల నుంచి, తీర్చిదిద్దే తల్లిదండ్రుల నుంచి, విద్యార్థికి ఉన్న సామర్థ్యం నుంచి వస్తుందన్నారు. ఇవన్నీ ఆవిష్కృతం చేసే కార్యక్రమంలో భాగంగానే మెగా పేరెంట్ మీట్ ఉపయోగపడుతుందన్నారు. పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో తల్లిదండ్రులకు తెలియాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కడ తీర్చిదిద్దాలో తెలుసుకోవాలని, ఏ అంశంలో ముందున్నారో ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో తెలుసుకోవడానికి ఈ ఆత్మీయ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. పూర్వం ఉన్న చదువులు వేరని ఇప్పుడు ఉన్న చదువులు వేరని ప్రస్తుత సమాజంలో ఆస్తి ఉన్నవాడి కన్నా చదువు ఉన్నవాడే గొప్పవాడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాబోయే బావి భారత పౌరులే నేటి విద్యార్థులు, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అందుకే లీప్ అనే యాప్ సైతం తీసుకొచ్చారని చెప్పారు. పిల్లవాడు యొక్క ప్రోగ్రెస్ స్కూల్ యొక్క ప్రోగ్రెస్ ఆ యాప్ లో తల్లిదండ్రులు చూసుకోవచ్చన్నారు. ఈ సంవత్సరం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కార్పొరేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారని అందుకు వంద రోజుల ప్రణాళిక ఎంతగానో దోహద పడిందన్నారు.వానపల్లి జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు సాధించిన ప్రతిభను ఆయన అభినందించారు. టెన్నికాయిట్‌కు జాతీయ స్థాయిలో ఒక విద్యార్థిని ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వానపల్లి పాఠశాలకు సైకిల్ స్టాండ్ నిర్మాణం చేపట్టాలని, గ్రౌండ్ లెవెలింగ్ కావాలని కోరారని తప్పకుండా సైకిల్ స్టాండ్ కట్టిస్తామని, గ్రౌండ్ లెవెలింగ్ తక్షణం చేపడతామన్నారు. ఇంకా ఏవిధమైన సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి కూర్చుని ఎమ్మెల్యే భోజనం చేశారు.

శ్రీ లక్ష్మీ వారాహి అమ్మవారి ఆషాడ నవరాత్రి మహోత్సవాల్లో

# పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి, మంత్రి వాసంశెట్టి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండలం, మాచవరం గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ వారాహి అమ్మవారి ఆషాడ నవరాత్రి మహోత్సవాల్లో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శ్రీ లక్ష్మీ వారాహి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కి వేదాశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించాలి

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 (పోష్ చట్టం) అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ కె. నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యాలయం, సంస్థ, విద్యాసంస్థలో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన, వివక్షలేని పని వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. పది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఏర్పాటు చేసి చట్ట నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఐసీసీలు పేరుకే కాకుండా చురుకుగా పనిచేయాలని, ఉద్యోగులకు పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కమిటీ వివరాలను కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఫిర్యాదుల గోప్యతను కాపాడుతూ నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎస్‌హీ-బాక్స్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మహిళలు కార్యాలయాల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని, ప్రతి ఉద్యోగికి ఈ పోర్టల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్షలో జిల్లా అధికారులు కొనసీమ జిల్లాలో ఇప్పటివరకు 1,039 అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐసీసీలు) ఏర్పాటు చేసినట్లు, ప్రతి కమిటీలో ప్రిసైడింగ్ అధికారి, మహిళా సభ్యులు, ఇతర సభ్యులు, బాహ్య సభ్యులను నియమించినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు పోష్ చట్టం కింద ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లాలో పోష్ చట్టం అమలులో తీసుకుంటున్న చర్యలను డాక్టర్ రాయపాటి శైలజ అభినందిస్తూ, అన్ని శాఖలు నిరంతరం సమీక్షలు నిర్వహించి ఉద్యోగులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టి మహిళలకు భద్రతతో కూడిన పని వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సుయాజ్, జిల్లా రెవెన్యూ అధికారి పి. సుబ్బారావు, జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులు, ఐసీసీ ప్రిసైడింగ్ అధికారులు, సభ్యులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# “ఒక నెల - ఒక గ్రామం, నాలుగు పర్యటనలు” కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే దాట్ల



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న “ఒక నెల - ఒక గ్రామం, నాలుగు పర్యటనలు “ కార్యక్రమంలో భాగంగా ఐ. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, జాయింట్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో కలిసి స్వీకరించి పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి, అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం “ఒక నెల - ఒక గ్రామం, నాలుగు పర్యటనలు” వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను జిల్లా, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, స్థానిక శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు సహకారంతో ముమ్మిడివరం నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మెగా పిటిఎం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధి పొడగట్లపల్లి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మెగా పిటిఎం కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వి.శేషుకుమార్ అధ్యక్షతన ఎస్ఎంసి చైర్మన్ జాలాది సహదేవుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎఎల్ఎసి జిల్లా కోఆర్డినేటర్ రమేష్ బాబు, ఎంఈఓలు బైర్రాజు శ్రీనివాస రాజు,ఆర్ నాగకుమార్ పాల్గొన్నారు.తొలుత పాఠశాల కమిటీ,ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులకు,పెద్దలకు పేరెంట్స్ కు పూలతో ఘనంగా ఆహ్వానించారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థులు పాదాలు కడిగి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్ని గమనిస్తూ ఉండాలని సెల్ఫోనుకు తల్లిదండ్రులు దూరంగా ఉండి పిల్లలను దూరంగా ఉంచాలని వారి ఆలోచనలను ఆసక్తిని గమనిస్తూ ఉండాలన్నారు. బడి అంటే కేవలం విద్య నేర్పడమే కాదని విద్యతోపాటు వినయం విధేయత సంస్కారం నేర్పినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపన్యసించారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం చైర్మన్ గోపిశెట్టి సత్తిపండు, ఎంపిటిసి సభ్యులు సఖినాల గణపతి,జిల్లా జనసేన జిల్లా నాయకులు దొంగ సుబ్బారావు, ఆత్మ సభ్యులు జనిపిరెడ్డి తాతారావు,కోఆప్టెడ్ సభ్యులు అల్లూరి పెద క్రృష్ణంరాజు, వీటి రాంబాబు, బొక్క చిరంజీవి, వెలుగొట్ల త్రిమూర్తులు, వీటి రాజు చిలకమర్తి శివక్రృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, అధికసంఖ్యలో పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ పాల్గొన్న జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే



**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ.పోలవరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ సమావేశానికి జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు అధికారులు, ప్రజాప్రతినిధులకు విద్యార్థులు ఘన ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఐ. పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ‘ లీప్ పాఠశాల’గా గుర్తించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మెగా పీటీఏ సమావేశాల ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మరింత సమన్వయం ఏర్పడి, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని సమీక్షించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ అభిరుచులు, లక్ష్యాలు, సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆత్మీయ వేదికే మెగా పీటీఏ సమావేశమని తెలిపారు. ఈ సమావేశాల ద్వారా విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశం చేయడం సాధ్యమవుతుందన్నారు.విద్యార్థుల కెరీర్‌ను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని, ఈ ప్రాంతం నుంచి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రముఖులను పాఠశాలకు ఆహ్వానించి విద్యార్థులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ ఎమ్మెల్యే శ్రీ చెల్లి వివేకానంద, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### రత్నంపేట పాఠశాలలో

## భారీ తల్లిదండ్రుల సమావేశం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రత్నంపేట పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాల్గవ భారీ తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వార్డు పెద్దలు, దాతలు, పట్టణ ప్రముఖులు వైట్ల సూర్యప్రకాష్ రావు, బి.రామ సుబ్బారావు, సతీష్, గుణ్ణం రామకృష్ణ, పూర్వ ప్రధానోపాధ్యాయులు వి.సుబ్బారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కె. శ్రీరాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైట్ల సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గతంలో పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, ప్రస్తుతం పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. రామ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల బాధ్యతలు ఎలా ఉండాలో వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఎస్.పద్మావతి పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలు, పాఠశాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి దృశ్యరూప ప్రదర్శన ద్వారా వివరించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులచే తల్లికి వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి. చివరగా విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు

## కూటమి ప్రభుత్వం భరోసా

### మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రూరల్ వెల్ల జిల్లా పరిషత్ హైస్కూల్, కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్, గొల్లపాలెం జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పి. టీ. ఎం 4.0) ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి సుభాష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67.47 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, 42.70 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోందని వెల్లడించారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఒక్కో విద్యార్థికి రూ.13,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. అనంతపురం జిల్లాలో ఒకే కుటుంబంలో తొమ్మిది మంది పిల్లలు చదువుకుంటే రూ.1.17 లక్షల వరకు అందించామని, అలాగే ఐదుగురు, ఆరుగురు పిల్లలు ఉన్న కుటుంబాలకు కూడా పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసి యువత భవిష్యత్తును దెబ్బతీసిందని సుభాష్ ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తుంటే ప్రతిపక్షం విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తోందని, గత వైసీపీ ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందకుండా చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ రామలక్ష్మణమూర్తి, ఎంఈఓలు శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, విష్ణుమూర్తి, విద్యా కమిటీ చైర్మన్లు, రామచంద్రపురం రూరల్ టిడిపి అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చావ్వకుల నారాయణ మూర్తి, జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న, కూటమి పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### భారత రాజ్యాంగ చరిత్ర

## గ్రంథ ఆవిష్కరణ కరపత్రాల విడుదల



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రసన్న విఘ్నేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న ‘భారత రాజ్యాంగ చరిత్ర’ గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు శుక్రవారం న్యాయదేవత విగ్రహం వద్ద విడుదల చేశారు. పిల్లి రాంబాబు రచించిన ఈ గ్రంథాన్ని దళిత్ కమాండో పత్రిక సంపాదకుడు పిల్లి డేవిడ్ కుమార్ ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో న్యాయవాదులు కొండేపూడి భరత్ కుమార్, నీలం మధుసూదన్ రావు, దొమ్మలపాటి సత్యనారాయణ, ఎన్. రామకృష్ణారెడ్డి, పిల్లా పృథ్వి రామయ్య, సూరంపూడి గంగాధరం, కముజు సూర్యనారాయణ, సూరంపూడి సత్యనారాయణ, బొడ్డపాటి సురేష్ కుమార్, గాడేపల్లి సత్యనారాయణ, అహ్మద్, ఆర్.ఆర్.కె, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో

## రోగుల కోసం షెడ్ ఏర్పాటు



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** సామర్లకోట యువత ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా సామర్లకోట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కార్తీక్, ఆసుపత్రి ఫార్మసీ ఎదురుగా రోగులు మరియు వారి సహాయకులు ఎండ, వర్షాల నుంచి రక్షణ పొందేందుకు షెడ్ అవసరాన్ని హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ దేవగురు చంద్రశేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డాక్టర్ దేవగురు చంద్రశేఖర్ ఈ విషయాన్ని కెటిసి విద్యాసంస్థల చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి, తన స్వంత ఖర్చులతో షెడ్ నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ షెడ్ ఏర్పాటుతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఎండ, వర్షాల ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందనున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమాజ సేవ పట్ల చిత్తశుద్ధితో ముందుకు వచ్చి సహకరించిన కెటిసి విద్యాసంస్థల చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తికి సామర్లకోట యువత, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సమనసలో పోలేరమ్మ తల్లి ఆషాఢ సారె వైభవం



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు తొలుత స్థానిక ప్రాథమిక పాఠశాల వద్దకు చేరుకుని, అక్కడి నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి చీర, గాజులు, మిఠాయిలతో పాటు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని దండిగమ్మ తల్లి ఆలయానికి వెళ్లి అక్కడ కూడా ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ యువత సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించడం ఆనందంగా ఉందని పలువురు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నెల రోజుల్లో సమస్యలకు పరిష్కారం : ఎమ్మెల్యే దాట్ల



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం “ఒక నెల - ఒక గ్రామం నాలుగు పర్యటనలు” కార్యక్రమం అమలు చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఐ.పోలవరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ రెవెన్యూ సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. అధికారుల నేతృత్వంలో నెల రోజుల్లో వాటికి పరిష్కారం చూపుతామని ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### ఎస్ఎన్ఎస్పీ పాఠశాలలో

## మెగా పీటీఎం 4.0 ఆత్మీయ సమావేశం



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం కొమరగిరిపట్టణంలోని శ్రీ నాపతి సుబ్బారావు పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం 4.0 ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం కీలకమని వారు పేర్కొన్నారు.ప్రభుత్వం విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మంతెన సురేష్ రాజు, కొమ్మూరి సత్తిబాబు, పరసా కిరణ్ కుమార్, గునిశెట్టి రోహిణి కుమార్, గుర్రం దొరబాబు, కడలి లాయర్ శ్రీను, బళ్ల సత్యనారాయణ, నల్లా రాము, ఆకుల రాము, కడలి రామకృష్ణ శెట్టి, నల్లా సత్తిబాబు, గుర్రం శ్రీను, మామిడిశెట్టి శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ సుంకర వాసు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మన డబ్బులు మన లెక్కలపై అవగాహన, ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలో మెప్మా వారి ఆధ్వర్యములో గౌరవ ప్రాజెక్టు డైరెక్టరు డి.పెంచలయ్య అధ్యక్షతన మునిసిపల్ ఆఫీసు నుండి ర్యాలీ మొదలై ఆర్డీఓ ఆఫీసు వరకు సాగినది. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమీషనర్ కె.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్ నందు యస్. హెచ్. జి సభ్యుల వారి యొక్క పొదుపులు, లోన్ ల కు సంబందించిన వివరాలు పొందుపరచబడినవి అని, మరింత పారదర్శకత పెరుగుతుంది అని, ఆర్థిక అవకతవకలు నివారించవచ్చు అని అంతేగాక నిరక్షరాస్యులు ఎవరన్నా వుంటే ఆడియో ద్వారా సంఘం యొక్క సమాచారం వినవచ్చు. సంఘ సభ్యుల యొక్క ఫోన్ ద్వారా వారి సంఘం యొక్క వివరాలు తెలుసుకొనుటకు సులువుగా ఈ యాప్ ఉపయోగబడుతుంది అని తెలియజేశారు. గౌరవ ప్రాజెక్టు డైరెక్టరు వారు మాట్లాడుతూ సంఘ మీటింగ్ లలో మన డబ్బులు మన లెక్కలు గురించి విరివిగా తెలియజేయాలని ఆర్. పి లకు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు తెలియజేశారు. అలాగే ఎప్పటికప్పుడు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు అందించే కార్యక్రమాల గురించి తెలుకోవాలని చెప్పారు. ఆర్.పిలు ద్వారా సంఘ సభ్యులకు మన డబ్బులు మన లెక్కలపై వార్డుల నందు అవగాహన కల్పించవలసినదిగా కోరడమైనది. ఈ ర్యాలీ కార్యక్రమము నకు గౌరవ మునిసిపల్ కమీషనరు, శ్రీ కె.వి.ఆర్.రాజు గారు, శ్రీ కె.మోహన్ కుమార్ గారు, టి. ఇ. మెప్మా, మరియు శ్రీమతి ఎన్. మహాలక్ష్మి, ఇంచార్జి ఏ. ఎం. డి. సి , కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.ఏ.ఎస్.ప్రసాద్, యస్.యల్‌యఫ్.ఆర్.పిలు, టి.యల్.యఫ్. ఆర్.పి, పెద్ద ఎత్తున డ్వాక్రా సంఘ మహిళలు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయడం జరిగినది.

## కొత్తూరు, మాలపాడు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల కారణంగా ఈ నెల 25వ తేదీ శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు హెడ్ క్వార్టర్ ఫీడర్ కు సంబంధించి కొత్తూరు, మాలపాడు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.



# అనపర్తిలో తాలిబన్ల తరహా పాలన

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి




**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనపర్తి నియోజకవర్గంలో రౌడీయిజం, తాలిబన్ల తరహా అరాచక పాలన నడుస్తోందని మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, మరికొందరి ఇండ్లపై ఇటీవల జరిగిన దాడులు కల్పితమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ దాడి ఘటనలో పోలీసులు అరెస్ట్ చేసిన ఇస్మాయిల్ అనే వ్యక్తి, ఎమ్మెల్యే కుమారుడు మనోజ్ రెడ్డితో కలిసి ఉన్న ఫోటోలను, దాడికి పాల్పడిన వారు అర్ధరాత్రి వీధుల్లో తిరిగిన సీసీటీవీ ఫుటేజీ ఆధారాలను ఆయన మీడియాకు విడుదల చేశారు. సుమారు 17 మంది దాడిలో పాల్గొంటే, ఎమ్మెల్యే ఒత్తిడి వల్లే పోలీసులు ఒక్కరినే అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి, దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా వైఎస్సార్‌సీపీ బాధితుల తరఫున పోరాటం ఆపదని స్పష్టం చేశారు.

### విమాన సాంకేతిక సమస్యతో

# లోకేష్ రెండు గంటలు నిరీక్షణ

## విమానాశ్రయంలో లోకేష్‌కు ఘనంగా వీడ్కోలు

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రుల ఆత్మీయ సమావేశానికి(4.0) పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శుక్రవారం కార్యక్రమం అనంతరం నారా లోకేష్ హైదరాబాద్ తిరుగు ప్రయాణానికి మధ్యాహ్నం మూడున్నర గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి విచ్చేశారు. లోకేష్ వెళ్లవలసిన విమానానికి సాంకేతిక లోపం ఏర్పడడం, లోకేష్ విమానాశ్రయంలో సుమారు రెండు గంటల పాటు నిరీక్షించి, హైదరాబాదు నుండి వచ్చిన ప్రత్యేక విమానంలో తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో సుమారు రెండు గంటలసేపు లోకేష్ తో పాటు రాజమహేంద్రవరం శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, రాజమహేంద్రవరం రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం రెవెన్యూ అధికారులు, తాసిల్దార్ సునీత, ఏపిడి తదితరులతో ముచ్చటించారు. అనంతరం లోకేష్ ఘనంగా వీడ్కోలు పలికారు.

# పేదల ఇళ్ళను తొలగిస్తే సహించేది లేదు..

## పెద్ద కాలువ వద్ద పుష్కరాలు ఏంటి..? - ప్రజలకు అన్యాయం చేస్తే ఆందోళనకు సిద్ధం : ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పెద్ద కాల్వ వద్ద ఇరిగేషన్ స్థలంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల పాకలు ఖాళీ చేయిస్తే సహించేది లేదని రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హెచ్చరించారు.ఇటీవల మండపేట పురపాలక సంఘం 2027 పుష్కరాలకు సంబంధించి మెయిన్ రోడ్ నుండి ఇరిగేషన్ పంట కాల్వ వెంబడి పెడపర్తి రేవు వరకు వెడల్పు అయిన రహదారి నిర్మాణనికి ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణంకు మూడు కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎప్పటి నుండో ఇక్కడ నివాసం ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్న సుమారు 100 మంది నిరుపేదల పూరిపాకలు తొలగిస్తామని పుర పాలక సంఘం కమీషనర్ టీవీ రంగారావు నోటీసులు ఇచ్చారు. ఈ నేపధ్యంలో ఆందోళన కు గురైన పేదలు తమ సమస్య ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టి కి తీసుకువెళ్లారు. మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, సూరంపూడి సత్య ప్రసాద్ లు బాధితులకు బాసటగా నిలిచారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ఆ ప్రాంతం లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద వర్గాలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఎవరైనా సరే ఓ ఇంటి నీ నిలబెట్టి ఆ ఇంట్లో దీపం పెడతారని పేర్కొన్నారు.ఇక్కడ దారుణంగా పూరిళ్లు తొలగిస్తామని చెప్పడానికి నోరు ఎలా వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో దీపం ఆర్పొద్దనీ విజ్ఞప్తి చేశారు.చేతనైతే దీపం వెలిగించండి అంతే కానీ నిరాశ్రయులను చేయొద్దని తనదైన శైలిలో హెచ్చరిక జారీ చేశారు. సాధారణంగా గోదావరికి పుష్కరాలు పన్నెండేళ్ళకు ఒకసారి వస్తాయని, పన్నెండు రోజులు ఉన్నాయన్నారు. అఖండ గోదావరి రాజమహేంద్రవం నుండి ధవళేశ్వరం, కోటిపల్లి వరకు గోదావరి పుష్కరాలు జరుగుతాయన్నారు. మండపేట పెద్ద కాల్వ కు పుష్కరాలేంటనీ ఎద్దేవా చేశారు.అన్యాయం గా ఇల్లు తొలగించాలని దౌర్జన్యం చేస్తే ప్రజా పక్షాన వైసిపి ఆందోళన చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హెచ్చరించారు.మండపేట కమీషనర్ టీవీ రంగారావు కు ఒకటే చెబుతున్నామని ఇక్కడ ఇళ్లకు ఏదైనా నష్టం చేయాలని లేదా తొలగించాలని ప్రయత్నం చేయొద్దని చెప్పారు. అభివృద్ధి పేరిట పేదల నీడ తొలగించొద్దని తోట త్రిమూర్తులు కోరారు.ఈ కార్యక్రమం లో వైసిపి టౌన్ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, వైసిపి ఆర్ టి ఐ కన్వీనర్ మందపల్లి రవి కుమార్, మాజీ కౌన్సిలర్ మెండు బాపిరాజు, వైసిపి జిల్లా కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, కోళ్ల శ్రీనివాస్, బిళ్లగుత్తి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరి అలంకారంలో కనకదుర్గమ్మ..

## నేడు ప్రత్యేక పూజలు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం దేవిచౌక్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో ఆషాఢమాస పూజా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాకాంబరి అలంకార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా శాకాంబరి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. శాకంబరి దేవి ప్రకృతికి, వ్యవసాయానికి ప్రతీకగా భావించబడుతుందని, అమ్మవారిని ఈ రూపంలో ఆరాధించడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని సంకల్పించి ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యేక అలంకారాన్ని దర్శించేందుకు గోకవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# ఆగస్టు 7న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల చలో పార్లమెంట్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు వేతన సవరణ పెన్షన్ సవరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సంచార్ భవనం వద్ద మూడు రోజులపాటు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. మహేశ్వరరావు మాట్లాడుతూ 2017 నుంచి ఉద్యోగులకు వేతన సవరణ, పెన్షనర్లకు పెన్షన్ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిఎస్ఎన్ఎల్ అఫార్ట్ బిలిటీ క్లాజ్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు ఆగస్టు 7వ తేదీన జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయంతో చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పెన్షన్ సహాయ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, జిల్లా ప్రెసిడెంట్ ఎన్ ఎస్ ఎన్ మూర్తి, కౌన్సిల్ మెంబర్ ఆర్‌వివి సత్యనారాయణ, స్థానిక బిఎస్ఎన్ఎల్ నాయకులు కోరుకొండ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ టెక్నీషియన్లు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి


## ఆర్ఎంటీఏ సమావేశంలో క్రైమ్ డీఎస్పీ సుభాష్ కీలక సూచనలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలు, మరమ్మతుల విషయంలో మొబైల్ టెక్నీషియన్లు అప్రమత్తంగా వ్యవహరించాలని క్రైమ్ డీఎస్పీ సుభాష్ సూచించారు. స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ఆర్ఎంటీఏ మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొబైల్ టెక్నీషియన్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా అసలు బిల్లును పరిశీలించాలని సూచించారు. ఫోన్ విక్రయించే వ్యక్తి వివరాలను కూడా నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్‌లాక్ చేయడం, సాఫ్ట్‌వేర్ సేవలు అందించడం వంటి పనులు చేపట్టే ముందు మొబైల్ యజమాని వివరాలను నిర్ధారించుకోవాలని చెప్పారు. ఆధార్ లేదా ఫోన్ నంబర్ ద్వారా యజమాని గుర్తింపును పరిశీలించిన తర్వాతే సేవలు అందించాలని సూచించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో ఏదైనా మొబైల్ ఫోన్ మరమ్మతులకు వచ్చినా, విక్రయానికి తీసుకొచ్చినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని డీఎస్పీ సుభాష్ కోరారు. అనుమానం ఉన్న ఫోన్లను నిర్లక్ష్యంగా స్వీకరించడం వల్ల భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి మొబైల్ దుకాణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణంలో జరిగే ప్రతి ముఖ్యమైన వ్యవహారం రికార్డయ్యేలా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నేరాలు, దొంగతనాలు, వివాదాస్పద ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని వివరించారు. మొబైల్ టెక్నీషియన్లు తమ వృత్తిలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ సుభాష్ సూచించారు. పోలీసుల సూచనలను నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా పాటించాలని కోరారు. చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తే అనవసరంగా కేసుల్లో ఇరుక్కునే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి మొబైల్ దుకాణదారుడు తన వద్దకు వచ్చే ఫోన్ల వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హేమంత్ మాట్లాడుతూ సభ్యులందరూ పోలీసుల సూచనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాల సమయంలో బిల్లును తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. రిపేర్‌కు వచ్చిన ప్రతి మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫోన్ ఎవరిది, ఏ సమస్యతో వచ్చింది, ఎప్పుడు స్వీకరించారు వంటి వివరాలను భద్రపరచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే అనవసరంగా చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో టెక్నీషియన్లపై కూడా బాధ్యత పెరుగుతోందని వారు తెలిపారు. అనుమానాస్పద ఫోన్ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసు శాఖ సూచనలను పాటించడం ద్వారా నేరాల నియంత్రణకు సహకరించడంతో పాటు వ్యాపారులు కూడా చట్టపరమైన ఇబ్బందుల నుంచి దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొబైల్ టెక్నీషియన్స్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు మొబైల్ టెక్నీషియన్లు పోలీసు అధికారులకు తమ సందేహాలను తెలియజేయగా, వాటిపై అధికారులు వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం సభ్యులు పోలీసుల సూచనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలిపారు.

### రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి

# జేడిఆర్ఎఫ్ ఘన సన్మానం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు జర్నలిస్ట్ డెమోక్రసీ రైట్స్ ఫోరం జేడిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జేడిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేడా శ్రీనివాస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మారంపూడి సోమరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేఖర్ల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని కోరారు. అలాగే ప్రెస్ క్లబ్‌లో కొత్త సభ్యులకు వెంటనే సభ్యత్వాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతా బాల విజయ సారధి మాట్లాడుతూ నూతన సభ్యులకు సభ్యత్వాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విలేఖర్ల సమస్యల పరిష్కారానికి జేడీఆర్ ఎఫ్ కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీఆర్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గోరెలా రమణ, వై. నరేష్, కోశాధికారి పిచ్చుక మహేష్, మీడియా కో-ఆర్డినేటర్ రమేష్, సభ్యులు , ఎండి నజీర్ అహ్మద్,రాఘవేంద్ర, యాకోబ్, సోమశేఖర్, నాగరాజు, కత్తి శ్రీను, ఇతర నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

### ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో

# మెగా పేరెంట్స్ మీటింగ్



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండపేట రూరల్ ఎస్ఐ వి.కిషోర్ మాట్లాడుతూ బాలికలు సోషల్ మీడియా పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులతో చాటింగులు వివిధ యాప్లను వాడడం మంచిది కాదన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ద్వారా విద్యార్థులకోసం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారని ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి అన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి వారి సొంత నిధులతో ఎన్నో వసతులు సమకూర్చారని పేర్కొన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ కో అప్టేటెడ్ సభ్యులు నాయుడు డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించిన రోజున దాతల సేవకు గౌరవమన్నారు. జనసేన నాయకులు చింతా శ్రీనివాసరావు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రతీ విద్యార్థి తినాలని ఎన్నో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని అన్నారు.మాజీ సర్పంచ్ మండ వీరభద్రరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా విధిగా పాఠశాలకు హాజరుకావాలని తల్లిదండ్రులు శ్రద్ధగా పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో తానింకి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు నీలా సత్యనారాయణ, విద్యార్థులు తల్లిదండ్రులు కూటమి నాయకులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిది

## రోడ్డుపై చెత్త వేసినందుకు వ్యాపారులకు భారీ జరిమానాలు : కమిషనర్ టీవీ రంగారావు





**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించి స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దాలని కమీషనర్ టీవీ రంగారావు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పురపాలక సంఘం కఠిన చర్యలు చేపట్టింది.మెయిన్ రోడ్లపై షాపుల ముందు చెత్త వేయవద్దని పలుమార్లు హెచ్చరించినా కొందరు వ్యాపారులు పట్టించుకోకపోవడంతో కమీషనరు టివి రంగారావు ఆదేశాల మేరకు జరిమానాలు విధించారు. కెపి రోడ్డులోని రెడీమేడ్ డ్రెస్సెస్ యజమాని రోడ్డుపై చెత్త వేయడంతో రూ వెయ్యి జరిమానా విధించారు. ఏడిద రోడ్డులో రోడ్డును త్రవ్వి పేడ నిల్వ ఉంచిన ఓ రైస్ మిల్లు నిర్వాహకులకు రూ 10 వేలు జరిమానా విధించి రశీదు ఇచ్చారు.ఈ సందర్భంగా కమీషనరు టీవీ రంగారావు మాట్లాడుతూ, ఇకపై రోడ్లపై చెత్త, సి,డి వ్యర్థాలు వేసి రోడ్లు, డ్రైనేజీలు బ్లాక్ చేస్తే మరింత ఎక్కువ పెనాల్టీలు విధిస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించి "స్వచ్ఛ మండపేట"గా తీర్చిదిద్దాలని కోరారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

జిమ్ చేయను.. కానీ రోజూ ఆ ఒక్క పని మాత్రం చేస్తా..

# నా ఫిట్నెస్ సీక్రెట్ ఇదే.. హీరో నాని..



న్యాచురల్ స్టార్ నానికి తెలుగు ప్రేక్షకులలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంటుంది. ముఖ్యంగా తన చిత్రాలతో ఫ్యామిలీ అడియన్స్ మనసులు గెలుచుకున్నారు. ప్రస్తుతం ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తున్నారు. అయితే హీరోహీరోయిన్స్ తమ ఫిట్నెస్ కాపాడుకోవడం కోసం నిత్యం కఠినమైన వర్కవుట్స్ చేస్తూ జిమ్ వీడియోస్, ఫోటోస్ అప్లోడ్ చేస్తుంటారు. కానీ నాని ఎప్పుడూ జిమ్ చేయలేదు. ఇందుకు గల రీజన్ బయటపెట్టారు నాని. తెలుగు చిత్ర పరిశ్రమలో న్యాచురల్ స్టార్గా పేరు సంపాదించుకున్నారు హీరో నాని. వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదున్నారు. ప్రస్తుతం ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తున్నారు. కొన్నినెలలుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. నాని జిమ్ అసలు జిమ్ చేయరు. ఎప్పుడూ తన జిమ్ వీడియోస్, ఫిట్నెస్ వీడియోస్ సైతం షేర్ చేయరు. గతంలో ఓ ఇంటర్వ్యూలో నాని తన ఈ లుక్ వెనుక ఉన్న రహస్యాలను, తన వ్యక్తిగత ఫిట్నెస్ మంత్రాలను వెల్లడించారు. తాను జిమ్కు వెళ్లకపోయినా, ఎప్పుడూ ఫిట్గా, ఆరోగ్యంగా ఎలా ఉండగలరో ఆయన వివరించారు. కొత్త సినిమా హాయ్ నాన్నలో యవ్వనంగా కనిపించడం గురించి అడిగినప్పుడు, నాని దీనికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. "కొద్దిగా బరువు తగ్గాను. దసరా తర్వాత గడ్డం తీసి, హెయిర్ స్టైల్ మార్చడం వల్ల లుక్ మారింది. కొంచెం హెయిర్ గ్రూమ్డ్ గా ఉంది. చిన్న స్టబుల్ (గడ్డం) ఉండటం వల్ల కూడా నీట్గా కనిపిస్తుంది. అలాగే, నా కాస్ట్యూమ్స్, ముంబైకి చెందిన ఓ ఆపరేటెడ్ కంపెనీ డిజైన్ చేయడం వల్ల ఒక క్లాస్ ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా, సినిమాటోగ్రాఫర్ సాను జాన్ వర్గీస్ ఒక మెజీషియన్ లాంటివారు. ఆయన బ్రిలియంట్ సినిమాటోగ్రఫీ వల్ల నాకు ఒక మంచి లుక్ వచ్చింది. ఇవన్నీ కలిపి నాకు ఈ యంగ్ లుక్ రావడానికి దోహదపడ్డాయి" అని నాని స్పష్టం చేశారు. శారీరక శ్రమ, ఆహారపు అలవాట్లపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ, తాను జిమ్లో అధిక వ్యాయామాలు, స్ట్రెంత్ ట్రైనింగ్ లేదా వెయిట్ లిఫ్టింగ్ చేయనని నాని తెలిపారు. "నేను కేవలం కార్డియో మాత్రమే చేస్తాను. నేను ఎప్పుడూ స్థిరమైన బరువును కలిగి ఉంటాను. దీనికి ప్రధాన కారణం నేను నిరంతరం పని చేయడమే" అని నాని అన్నారు. "పని చేయడమే అత్యంత ముఖ్యమైన విషయం. మనం ఇంట్లోనే కూర్చుంటే సహజంగానే బరువు పెరుగుతాం. పనిలో నిమగ్నమైతే మనం ఫిట్గా ఉండగలం" అని ఆయన వివరించారు. ఆహారపు అలవాట్ల విషయానికి వస్తే, నాని చాలా విలక్షణమైన పద్ధతిని అనుసరిస్తారు. "నేను ప్రతిదీ, ఏదైనా తింటాను" అని ఆయన చెప్పారు. ఆహార నిపుణుడిగా తాను చెప్పలేనప్పటికీ, తన పరిశీలన ప్రకారం, బరువు తగ్గడానికి డైట్లు పాటించేవారు, కొన్ని ఆహారాలు మానేసినవారు దీర్ఘకాలంలో తిరిగి బరువు పెరుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. "శరీరాన్ని టార్చర్ చేయకూడదు. చిన్నప్పటి నుండి మనం ఏ ఆహారానికి అలవాటుపడ్డామో, అదే మన శరీరానికి మంచిది. ఇంట్లో వండిన ఆహారం, అమ్మ చేతి పిండివంటలు వంటి సంప్రదాయ ఆహారాలను కొనసాగించడం మంచిది" అని నాని సూచించారు. "అయితే, ఏదీ అతిగా తినకూడదు" అని ఆయన అన్నారు. ఉన్నపళంగా ఇంట్లో భోజనం మానేసి సలాడ్లకు మారితే శరీరం దానికి సిద్ధంగా ఉండదని, ఒత్తిడికి గురవుతుందని నాని హెచ్చరించారు. "ఇది నా అవగాహన" అని చెబుతూ, ఇప్పుడు మళ్లీ అందరూ తమ మూలాలకు తిరిగి వస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు డైట్ల పేరుతో అనేక పద్ధతులు ప్రచారంలో ఉన్నాయని, కానీ అవి దీర్ఘకాలంలో ఆరోగ్యానికి మంచివి కావని అన్నారు. "మీరు ఏదైనా తినండి, కానీ నియంత్రణ, క్రమశిక్షణ కలిగి ఉండండి. అదే జీవితంలో ముఖ్యమైనది" అని నాని తన ఫిట్నెస్ గురించి చెప్పుకొచ్చారు.

సినీ వాయిస్ CINE VOICE

అబ్బబ్బా.. క్రేజీ జోడి భయ్యా.. ప్రభాస్ సరసన ఆ స్టార్ హీరోయిన్..

# స్పిరిట్ మూవీలో కీలకపాత్ర..?!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. డార్లింగ్ సినిమాలపై ఇప్పటికే మంచి హైప్ నెలకొంది. ఈ క్రమంలో తాజాగా స్పిరిట్ మూవీ గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ఈ చిత్రంలో ఇదివరకే త్రిప్తి డిమ్రి నటిస్తుండగా.. మరో స్టార్ హీరోయిన్ సైతం భాగం కానుందట. ఇంతకీ ఆమె ఎవరు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. కాంబినేషన్ ప్రకటన నుంచే ఈ సినిమాపై సినీ ప్రియుల్లోనూ, అభిమానుల్లోనూ అపారమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్కి సంబంధించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఒక పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఇప్పటికే ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అయితే కత్రినా కైఫ్ను సెకండ్ హీరోయిన్గా కాకుండా, కథలో అత్యంత ప్రాధాన్యత ఉన్న, కథను మలుపు తిప్పే ఒక విశిష్టమైన పాత్ర కోసం సంప్రదించినట్లు టాక్. ఒకవేళ ఇది నిజమైతే, వెండితెరపై ప్రభాస్ - కత్రినా కాంబినేషన్ అభిమానులకు అసలైన విజువల్ ఫీస్ట్గా మారనుంది. కత్రినా కైఫ్కు తెలుగు పరిశ్రమతో పాత అనుబంధమే ఉంది. గతంలో ఆమె విక్టరీ వెంకటేష్ సరసన 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్కే పరిమితమైన కత్రినా, చాలా కాలం తర్వాత మళ్లీ ఒక భారీ సౌత్ ఇండియన్ ప్రాజెక్ట్లో భాగం కాబోతుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, 'స్పిరిట్' షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఇందులో ప్రభాస్ ఐపీఎస్ ఆఫీసర్గా, మునుపెన్నడూ చూడని అత్యంత పవర్ ఫుల్ ఇంటెన్స్ లుక్లో కనిపిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మిగిలిన చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి, 2027 మార్చిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కత్రినా కైఫ్ చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వస్తే మాత్రం ఈ సినిమాపై ఉన్న క్రేజ్ మరిన్ని రెట్లు పెరగడం ఖాయం. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ టఫ్, పవర్ ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్, కత్రినా కైఫ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారని టాక్. హర్షవర్ధన్ రామేశ్వర్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ వరుసగా



భారీ పాన్-ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఫౌజీ.. ఆజాద్ హింద్ ఫౌజ్ నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. వీటితో పాటు భారతీయ సినీ రంగంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'కల్కి 2', 'సలార్ పార్ట్-2 (శౌర్యాంగ పర్వం)' చిత్రీకరణల్లో కూడా పాల్గొననున్నారు.

క్రీడా వాయిస్ – మీ క్రీడా వార్తల స్వరము

నిలవాలంటే గెలవాల్సిందే.. ప్రతీకారానికి మాస్టర్ ప్లాన్..

# తుది జట్టులో కీలక మార్పులు..!



సొంత మైదానంలో జరుగుతున్న ఈ ఉత్కంఠ పోరులో జింబాబ్వే పుంజుకుంటుందో లేక టీమిండియా తన గెలుపు జోరును కొనసాగిస్తుందో చూడాలి. తుది జట్టులో చేయబోయే మార్పులు ఎంతవరకు ఫలిస్తాయో మ్యాచ్ ప్రారంభమయ్యాకే తేలనుంది. కాగా, ఈ మ్యాచ్లో గెలిస్తేనే సిరీస్లో నిలిచి ఉంటుంది జింబాబ్వే. భారత్తో జరుగుతున్న ఐదు మ్యాచ్ల టీ20 సిరీస్లో బోణీ కొట్టలేకపోయిన జింబాబ్వే, రెండో సమరానికి సమరశంఖం పూరించింది. హరారే మైదానంలో టీమిండియాను ఎదుర్కొనేందుకు జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రాజా వ్యూహాలకు పదును పెడుతున్నాడు. మొదటి మ్యాచ్లో ఎదురైన పరాభవాన్ని అధిగమించి, సిరీస్ను సమం చేసేందుకు తుది జట్టులో సంచలన మార్పులు చేసేందుకు రంగం సిద్ధం చేశాడు.

**హరారేలో జీవన్మరణ పోరాటం.. జింబాబ్వేకు చావో రేవో..!**

సిరీస్లోని తొలి మ్యాచ్లో భారత కుర్రాళ్ల దాటికి జింబాబ్వే తలవంచక తప్పలేదు. ఇప్పుడు రెండో టీ20 మ్యాచ్లోనూ ఓడిపోతే సిరీస్ను చేజార్చుకునే ప్రమాదం ముంగిట నిలిచింది. ఈ నేపథ్యంలో సొంతగడ్డపై సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్లో ఖచ్చితంగా గెలవాల్సిందే. అందుకోసమే కెప్టెన్ సికిందర్ రాజా పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగుతున్నాడు. తొలి మ్యాచ్లో జింబాబ్వే టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడటంతో తక్కువ పరుగులకే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు మేనేజ్మెంట్ తుది జట్టులోని ఓపెనింగ్ జోడీ లేదా టాప్ ఆర్డర్ బ్యాటింగ్ కాంబినేషన్లో మార్పులు చేసే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఇన్నింగ్స్ను నిలకడగా ప్రారంభించే ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. భారత బ్యాటర్లను కట్టడి చేయడంలో జింబాబ్వే బౌలర్లు గత మ్యాచ్లో ఘోరంగా విఫలమయ్యారు. ముఖ్యంగా యంగ్ హిట్టర్లను కట్టడి చేసేందుకు తగిన లైన్ అండ్ లెంగ్త్ దొరకలేదు. అందుకే హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ తీరుకు అనుగుణంగా వేరియేషన్స్ ఇవ్వగలదనగలిగే బౌలర్లను, ప్రత్యేకించి అదనపు స్పిన్నర్ లేదా సీమర్ను జట్టులోకి తీసుకురావాలని రాజా యోచిస్తున్నాడు. జింబాబ్వే జట్టు ఆశలన్నీ ప్రధానంగా కెప్టెన్ సికిందర్ రాజాపైనే ఆధారపడి ఉన్నాయి. అతను బ్యాట్తోనూ, బంతితోనూ ముందుండి నడిపిస్తే తప్ప భారత్ లాంటి బలమైన జట్టును నిలువరించడం సాధ్యం కాదు. జట్టు సభ్యులందరినీ ఏకతాటిపైకి తెచ్చి పోరాట పటిమ చూపిస్తేనే ఈ మ్యాచ్లో విజయం సాధ్యమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# సంచలన బౌలింగ్ వెనుక 'రజనీ సర్' మ్యాజిక్..

టీమిండియా ఫాస్ట్ బౌలర్ కీలక వ్యాఖ్యలు..!

గాయం నుంచి కోలుకొని దాదాపు రెండేళ్ల తర్వాత టీమ్ ఇండియాలోకి పునరాగమనం చేసిన టీమ్ ఇండియా ఎక్స్ప్రెస్ పేసర్ మయాంక్ యాదవ్ తొలి బంతికే వికెట్ తీసి సంచలనం సృష్టించాడు. జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో 149 కిలోమీటర్ల వేగంతో అదరగొట్టిన ఈ స్పీడ్స్టర్, తన ఈ సూపర్ ఫిట్నెస్ క్రెడిట్ అంతా ట్రైనర్ 'రజనీ సర్'కే దక్కుతుందని వెల్లడించాడు. భారత యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ మళ్లీ తన గంటకి 150 కిలోమీటర్ల వేగంతో ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో గుబులు రేపాడు. సుదీర్ఘకాలం పాటు గాయాల సమస్యతో జట్టుకు దూరమైన మయాంక్ యాదవ్, జింబాబ్వేతో జరిగిన తొలి టీ20 మ్యాచ్లో గ్రాండ్ రీ-ఎంట్రీ ఇచ్చాడు. మ్యాచ్ వేసిన తొలి బంతికే ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ను పెవిలియన్కు పంపి చరిత్ర సృష్టించాడు.

**తొలి బంతికే వికెట్.. 149 కిలోమీటర్ల వేగం..!**

హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేసే బాధ్యతను కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మయాంక్ యాదవ్కు అప్పగించాడు.

**మొదటి బంతికి వికెట్:** మయాంక్ 149 కిమీల వేగంతో విసిరిన బంతిని డిఫెండ్ చేసుకోబోయిన బెన్నెట్, కీపర్ ఈషాన్ కిషన్ చేతికి క్యాచ్ ఇచ్చాడు. మొదట అంపైర్ నాటౌట్ అని ప్రకటించినా, డీఆర్ఎస్ సమీక్ష ద్వారా అవుట్గా తేలడంతో జింబాబ్వేకు కోలుకోలేని షాక్ తగిలింది.

**4 ఓవర్లలో 2/18:** తన 4 ఓవర్ల కోటాలో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు.

**'రజనీ సర్' లేకపోతే నేను ఇక్కడ ఉండేవాడిని కాదు..!**

మ్యాచ్ అనంతరం తన ఫిట్నెస్ సాధనపై స్పందించిన




మయాంక్ యాదవ్, స్ట్రెచ్ ఫ్రాక్చర్ గాయం నుంచి బయటపడటానికి తన ట్రైనర్ 'రజనీ సర్' (రజనీకాంత్ శివజ్ఞానం) ఎంతగానో శ్రమించారని భావోద్వేగానికి గురయ్యాడు. "గాయపడిన సమయంలో మైదానంలోకి ఎప్పుడు వస్తానో తెలియని నిరాశలో ఉన్నాను. కానీ ఎన్సీఏలో రజనీ సర్ నా ఫిట్నెస్పై ప్రత్యేకం శ్రద్ధ తీసుకున్నారు. నా బౌలింగ్ రన్-అప్, బాడీ మెకానిజంలో మార్పులు చేసి నన్ను మళ్లీ ఈ స్థాయిలో సిద్ధం చేశారు. నా ఈ అద్భుతమైన కమ్బ్యాక్ వెనుక ఆయన శ్రమ ఎంతగానో ఉంది" అని మయాంక్ పేర్కొన్నాడు.

**భారత్ ఘన విజయం..**

మయాంక్ యాదవ్ (2/18), ప్రిన్స్ యాదవ్ (2/19) ధాటికి జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 125/7 పరుగులకే పరిమితమైంది. అనంతరం లక్ష్యాన్ని భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మయాంక్ తిరిగి పాత వేగంతో బౌలింగ్ చేస్తుండటంతో భారత అభిమానులు తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# తులికా మాన్పై సస్పెన్షన్ వేటు..

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్కు దూరం



బర్మింగ్హామ్ కామన్వెల్త్ గేమ్స్లో రజత పతక విజేత, భారత మహిళా జుడోకా తులికా మాన్కు షాక్ తగిలింది. డోపింగ్ పరీక్షలను తప్పించుకున్నందుకు ఆమెపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సస్పెన్షన్ వేటు వేసింది. రిజిస్టర్ టెస్టింగ్ పూల్ (ఆర్టీపీ) జాబితాలో ఉన్న తులికా గత 12 నెలల్లో తన అడ్రెస్ వివరాలను అందించడంలో విఫలం కావడంతో డోపింగ్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి నాడా చర్యలు తీసుకుంది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్కు తులికా దూరమైంది. 2022లో బర్మింగ్హామ్లో జరిగిన పోటీల్లో 78 కిలోల విభాగంలో తులికా మాన్ రజత పతకం గెలుచుకుంది. డోప్ పరీక్షల్లో పట్టుబడడంతో భారత జుడోకా అరుణ్ కుమార్ (73కేజీ) కూడా గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్కు దూరమైన విషయం తెలిసిందే. జుడో పోటీలు ఈ నెల 31న ఆరంభం కానుండడంతో భారత జుడో బృందం ఇంకా గ్లాస్గో బయలుదేరలేదు. ఈ నెల 27న వెళ్తుంది. గత సీడబ్ల్యూజీలో భారత జుడోకాలు మూడు పతకాలు సాధించారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com